



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 307 | సోమవారం 25 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## నీట్ లీకేజీపై మోడీ మౌనం

- ప్రమాదంలో లక్షల మంది విద్యార్థుల భవిష్యత్
- ప్రధాని స్పందించరేం : రాహుల్ గాంధీ ఫైర్

2



## కర్ణాటకపై సీఎం విజయ్ చూపు..

- బెంగళూరు మున్సిపల్ ఎన్నికల్లో 'టీవీకే' పోటీకి సిద్ధం?
- త్వరలో బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు
- బెంగళూరులో నివసిస్తున్న లక్షలాది మంది తమిళులు
- కర్ణాటకలో జెండా పాతాలనుకుంటున్న విజయ్

2





## ఒకే కుటుంబంలోని 8 మంది మృతి

- ఆల్చిప్పల కోసం వెళ్లి నదిలో మునిగి..
- ఉత్తర కన్నడ జిల్లాలో ఘోరం
- ఒక్కసారిగా నీటి మట్టం పెరగడమే కారణం

సిరాలి - సూర్య వాస్తవం

కర్నా టకలోని ఉత్తర కన్నడ జిల్లా భట్కల సమీపంలోని తత్తెహక్కలు నదిలో నత్తగుల్లల సేకరణ కోసం దిగిన ఒకే కుటుంబానికి చెందిన 11 మంది గల్లంత య్యారు. సమాచారం అందుకున్న పోలీ సులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో 8 మంది మృతదేహాలను వెలికితీశారు. మృతులంద రినీ భట్కల తాలూకా సిరాలి గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మిగిలిన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు

- మిగతా 2లో..

## ఇవన్నీ.. వొద్దింక..
# వచ్చేసింది.. బొద్దింక..!!




### పారిశుధ్య మెరుగుకు సోమరుల పిలుపు...

ప్రస్తుతానికి దేశ వ్యాప్తంగా బొద్దింక ఉద్యమంపై విస్తృత స్థాయి చర్చ కొనసాగుతోంది. దేశ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతున్న కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) దేశం యావత్తు అందరి నోళ్ళలో నానుతోంది. గత కొంత కాలంగా నీరసం.. నిస్సత్తువ, నిరాశ ఆవహించిన దేశీయ యువతరం .. ఈ ఉద్యమం..వైపు క్రమక్రమంగా మొగ్గు చూపుతోంది.. అంతర్జాలంలో మూడు కోట్లకు పైగా సభ్యత నమోదుతో బొద్దింక పార్టీ తన విశ్వరూపాన్ని ప్రదర్శించేందుకు సన్నద్ధమవుతోంది. ఏళ్లుగా అవమానంతో రగిలిపోతూ.. అసహనంతో కుమిలి పోతున్న యువతరం.. నెట్టింట పార్టీని ఇంటింటా చేర్చేందుకు సమాయత్తమవుతోంది. అందుకు రాండం సర్వేలు నిర్వహిస్తూ ప్రజాభిప్రాయం కూడగడుతోంది.

- దేశ రాజకీయాల్లో కాక్రోచ్ పార్టీ న్యూ ఎంట్రీ..
- సోషల్ మీడియాను షేక్ చేస్తున్న కాక్రోచ్ మిషన్ ..
- నిరుద్యోగులు,యువతరంతో బొద్దింకల సైన్యం...
- నీతి,నిజాయితీలే అన్నింటా కొలమానం..
- వెరైటీ యాక్షన్ ప్లాన్‌తో రాజకీయ కలకలం..

మహమ్మద్ షఫీ అహ్మద్..
సూర్యవాస్తవం-ప్రత్యేక ప్రతినిధి,.

దేశం అన్నింటా అధ:పాతాళానికి చేరినా.. మౌనం వహిస్తున్న పౌర సమాజాన్ని నిగ్గతీసి అడిగేందుకు., దేశ మానమర్యాదలు ఇంటా, బయట మంటగలుస్తున్నా, జీవచ్ఛవంలా బతుకుతున్న సమాజాన్ని నిప్పులతో కడిగేందుకు.., అనర్హులకు అందలాలు ఎక్కించి... తైలాల మత్తులో చిత్తవుతున్న దేశ భవితవ్యాన్ని పరిరక్షించేందుకు బొద్దింక సైన్యం బలిదానాలకు సిద్ధపడుతున్నట్లు అంతర్జాలన్నంతా హోరెత్తిస్తుంది. దశాబ్దాల నిశ్శబ్దాని ఛేదిస్తూ.. జరిగిన నష్టం చాలు.. ఇవన్నీ.. వద్దింక..- వచ్చేసింది.. బొద్దింక.. అనే నమ్మకాన్ని దేశ ప్రజల్లో కల్పించేందుకు సన్నాహాలు చేస్తోంది. పంచశీల సూత్రాలతో,. అందరికీ సహజ న్యాయం, సమన్యాయం కోరుతూ.. బాధ్యతాయుతమైన జవాబూ దారీ రాజకీయ వ్యవస్థకు శ్రీకారం చుడుతూ దేశ వాసులను తమకు అండగా నిలువాలని పిలుపునిస్తోంది.




**జవాబూదారీ తనమే, కొలమానం..**

చట్ట సభల ప్రతినిథులకు అర్హతలే కొలమా నంగా జవాబుదారీ తనం ఉండాలని., అందుకు సామర్థ్యం పరీక్ష నిర్వహించాలనేది బొద్దింకల ప్రాథమిక ప్రతిపాదన. రిజర్వేషన్లకు కులం కొలమానం తొలగించాలని, ఆదాయం..ఆస్తుల, ప్రాతిపదికన కోటా అమలు పర్చాలనేది రెండవ ప్రతిపాదన. నేరం రుజువైన

- మిగతా 2లో..



## సీఎం రేవంత్ రెడ్డితో తమిళనాడు మంత్రి భేటీ

2

## ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనం

### - నారా లోకేష్

- విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ రద్దు కాలేదని ప్రభుత్వం స్పష్టీకరణ
- పశ్చిమాసియా యుద్ధం కారణంగా నెలరోజులు ఆలస్యం
- పాఠశాలలు తెరిచేనాటికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ
- యూనిఫాం, బూట్లు, బ్యాగ్‌ల సరఫరాకు కొంత సమయం
- వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్న మంత్రి నారా లోకేష్

అమరావతి - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పూర్తిగా నిలిపివేసిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఈ ప్రచారం వందశాతం అవాస్తవమని, కిట్ల పంపిణీని ఆపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం కొన్ని అంతర్జాతీయ కారణాల వల్ల



కిట్ల సరఫరాలో సుమారు నెల రోజుల జాప్యం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం నిజాయతీగా జాప్యం గురించి వెల్లడిస్తే, దానిని వక్రీకరించి అసలు కిట్లే ఇవ్వరంటూ వైసీపీ పార్టీ విష ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనమని విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ముడిసరుకుల

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



## రేలా.. అదిరేలా..

- రంపచోడవరంలో ఘనంగా ఆదివాసీ ఉత్సవాలు ప్రారంభం
- సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం భారీగా కదిల

2

# ఇవన్నీ..వొద్దింక..
# వచ్చేసింది.. బొద్దింక..!!









(మొదటిపేజీ తరువాయి)
రాజకీయ ప్రతినిధులకు, ఆధికారులు, ఉద్యోగులను సదరు హోదాలనుంచి శాశ్వతంగా తొలిగించాలని, పున:ప్రవేశంపై నిషేధం విధించాలనేది మూడో ప్రధాన డిమాండ్. ప్రజా ప్రభుత్వాలు ఉచితాల కంటే, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలనేది నాలుగో ప్రతిపాదన. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా.. నయాపైసాతో సహా లెక్కలు చూపాలనేది ఐదో డిమాండ్. నెట్టింట వైరల్ అవుతున్న బొద్దింక పార్టీ మాస్ ఎజెండాకు లక్షల నెటిజన్స్ లైకులతో ఫాలో అవుతున్నారు. కేంద్రంలోని అధికార బీజేపీతో పాటు, విపక్ష కాంగ్రెస్ పార్టీల అధికారిక ఇన్‌స్టా ఖాతాలను దాటేస్తూ నెటిజన్లు బొద్దింకల మిషన్‌కు మద్దతు తెలుపుతున్నారు.

**కాక్రోచ్ మిషన్ వెరైటీ యాక్షన్ ప్లాన్ :**

రాజ్యాంగ వ్యవస్థల పట్ల నమ్మకం, న్యాయవ్యవస్థల పట్ల విశ్వాసం సన్నగిల్లుతున్న నేటి సంక్లిష్ట పరిస్థితుల్లో ఎంట్రీ ఇచ్చిన కాక్రోచ్ మిషన్ తన దైన యాక్షన్ ప్లాన్‌తో ముందుకు సాగుతోంది. సరిగ్గా ఓ వారం క్రితం వరకు ఈ తరహా చర్చకు తెలంగాణా పౌర సమాజం దేశం మొత్తానికి కేంద్ర బిందువు అయింది. ఓ కేంద్ర మంత్రి తనయుడి చీకటి కోణంపై దేశం యావత్తు దృష్టి పెట్టేలా ఓ బలమైన ప్రజా ఉద్యమాన్ని చేపట్టి, దేశ రాజ్యాంగ చట్టాలు ఎవరికీ చుట్టం కావని నిరూపించింది. ఒక్క మాటలో చెప్పాలంటే.. దేశం యావత్తు తమ వైపు చూసేలా తెలంగాణా ప్రజానీకం మడమ తిప్పని పోరాట పటిమ ప్రదర్శించింది. ఇంటర్‌నెట్ ప్లాట్ ఫాంను విస్తృతంగా వాడి సమస్యపై దేశ వ్యాప్తంగా వేడిని రగిలించింది. ఎట్టకేలకు పాలనా వ్యవస్థ, ప్రభుత్వ యంత్రాంగం దిగిరావడంతో అరెస్టులు జరిగాయి. అధికార మదాన్ని పాతాళానికి అదిమిన తెలంగాణా సమాజం పోరాట స్ఫూర్తికి దేశమంతా ఫిదా అయిందని చెప్పక తప్పదు. రోజుల వ్యవధినే దేశ అత్యున్నత న్యాయాధిపతి అనుచిత వ్యాఖ్యలకు నొచ్చుకున్న దేశీయ యువతరం తెలంగాణా ఉద్యమం తరహాలోనే బొద్దింక పార్టీకి బేషరతు మద్దతునిస్తోంది.

**నీట్ వైఫల్యంపై ప్రశ్నలతో తొలిఅడుగు :**

'నీట్' పరీక్ష లీకేజీ సహా సమకాలీన సమస్యలపై కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) ప్రశ్నలు సంధిస్తూ పుంఖానుపుంఖాలుగా పోస్టులను వైరల్ చేస్తోంది. నీట్ నిర్వహణా వైఫల్యంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను టార్గెట్ చేస్తూ రాజీనామాకు డిమాండ్ చేస్తోంది. విద్యా మంత్రి రాజీనామాతో పాటు, నేషనల్ టెస్టింగ్ ఏజన్సీని రద్దు చేయాలని ఆన్‌లైన్ ఓటింగ్ చేపడితే.. గంటల వ్యవధిలో ఆరులక్షలకు పైగా సంతకాలు నెట్టింట హల్‌చల్ చేశాయి. పట్టుమని ఓ డజను రోజులు దాటని బొద్దింక పార్టీకి మూడుకోట్లకు పైగా యువత నెట్టింట హారతులు పడుతోంది. ఆపార్టీకి జై కొట్టిన కోట్లాది మందిలో 94.7 శాతానికి మించి దేశీయ యువతే ఉంది. అమెరికా,యూకే వంటి దేశాల్లో స్వల్పంగా సభ్యత్వం నమోదు కాగా,సీజేపీ గ్లోబల్ కంటే లోకల్ లెవల్,దేశీయ అంశాలపైనే ప్రశ్నలు సంధిస్తూ పాలనా వైఫల్యాలపై తన తడాఖాను చూపెడుతోంది.

**బొద్దింక దూకుడుతో రాజకీయ ప్రకంపనలు :**

బొద్దింక దూకుడు దేశ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించడమే కాక, ప్రధాని నరేంద్ర మోడీని సైతం కలవరపాటుకు గురిచేసిందనే చెప్పవచ్చు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనికి, మెలోడీ చాక్లెట్లను గిఫ్ట్‌గా ఇచ్చి స్వదేశం చేరుకున్న ప్రధాని మోడీ.. నేరుగా క్యాబినేట్ సమావేశంలో పాల్గొని., సోషల్ మీడియా వాడకం పైనే సహచరులకు క్లాస్ పీకారంటే..బొద్దింక పార్టీ ఎఫెక్టును అంచనా వేయవచ్చు. దేశ రాజకీయ అస్థిరతను దునుమాడుతున్న 'బొద్దింక' బొందిలో ప్రాణం నిలపడానికి ప్రధాన కారణం బోస్టన్ వర్సిటీ మాస్టర్ డిగ్రీ కమ్యూనికేషన్ విద్యార్థి అభిజిత్ దీప్కే. అందుకు ప్రధాన నేపథ్యం యువతరంపై సుప్రీం కోర్టు సీజే సూర్యకాంత్ అనుచిత వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు. ఆపై సీజే తన ఉద్దేశం అదికాదని, తనలా అనలేదని సర్దుబాటు చేసినా నిరసన సెగలు చల్లారలేదు. ఇదే అదనుగా బోస్టన్‌లో ఉన్న పొలిటికల్ కమ్యూనికేషన్ స్ట్రాటజిస్ట్ అభిజిత్ దీప్కే వ్యంగ్యమే.. అస్త్రంగా మే 16న కాక్రోచ్ జనతాపార్టీని ప్రకటించారు.

**సీజేపీ వ్యవస్థాపకుడు డిజిటల్ స్కాలర్**

2023కు ముందు ఆమాద్మీ పార్టీ సోషల్ మీడియా యాక్టివిస్ట్‌గా పనిచేసిన ఆయన నేరేటివ్ బిల్డింగ్,పబ్లిక్ మెసేజింగ్,డిజిటల్ మేనేజ్‌మెంట్‌లో సిద్ధహస్తుడు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మీమ్ ఆధారిత డిజిటల్ క్యాంపెయిన్‌లో ఆయనది కీలక పాత్ర. ఆపట్టు ఆధారంగానే అభిజిత్ బొద్దింక పార్టీ 'మీమ్స్' మమ్మీకి పురుడు పోశారు. దాంతో ఈ పార్టీకి మద్దతుగా,, వేలల్లో , లక్షల్లో.. కోట్లలో నిరుద్యోగులు పుట్టుకొస్తున్నారు. బొద్దింక పార్టీ అధికారిక వెబ్‌సైట్‌కూడా ఇదే స్పష్టం చేస్తుంది. తమ పార్టీ నిరుద్యోగ యువతరానికి చెందినదని, సభ్యత్వానికి నిరుద్యోగం,సోమరితనం అర్హతలని ప్రకటించింది. సభ్యులు రోజూ 11 గంటల సమయాన్ని ఆన్‌లైన్ సేవలకు వెచ్చించాలని, సమాజ హితం కోరుతూ పదునైన విమర్శలు నిజాయితీతో సంధించాలనే షరతు పెట్టింది. దాంతో శ్రీలంక,నేపాల్ మాదిరిగా జెన్–జెడ్ యువత అప్రమత్తమైంది. నిరాశ,నిస్సత్తువలను వీడి తన సత్తా చాటేందుకు డిజిటల్ వేదికగా మెదళ్లకు పదును పెడుతోంది.

**సోషల్ మీడియాను షేక్ చేస్తున్న మీమ్స్**

కాక్రోచ్ మీమ్స్,ట్రెండింగ్ రీల్స్..డైలీ అప్‌డేట్స్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. డిజిటల్ స్కాలర్ అభిజిత్ తొలి బొద్దింక మీమ్‌తో కాక్రోచ్ పార్టీని ప్రకటించిన గంటల వ్యవధిలోనే 47 వేలమంది నెటిజన్లు సభ్యులుగా చేరారు. డిజిటల్ ప్రపంచం విస్తుపోయేలా ఆ సంఖ్య నేటికి మూడు కోట్లకు మించింది. దేశీయ సమస్యలపై, పాలకుల వైఫల్యాలపై జెన్–జెడ్ యువత లక్ష్యం దిశగా సంధిస్తున్న వ్యంగ్య బాణాలు శూలాల్లా గుచ్చుకొంటున్నాయి. ఓ దశలో కాక్రోచ్ పార్టీ ఇండియన్ వెబ్‌సైట్‌ను,ఇన్‌స్టా ఖాతను, ఎక్స్ హ్యాండర్లను బ్లాక్ చేసే ప్రయత్నం జరిగింది. వేరే ఐడీతో మళ్లీ బొద్దింక జీవం పోసుకుందని, వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే స్క్రీన్ షాట్ ఆధారాలతో బయటపెట్టారు.. ఇండియా రాగానే తన అక్రమ అరెస్టుకు అవకాశం ఉందని, స్వదేశంలోని తన కుటుంబీకులకు చంపుతామనే బెదిరింపులు వస్తున్నాయని ఏకరువు పెట్టారు.

**బొద్దింక పార్టీది క్లీయర్ విజన్**

పాలనా వ్యవస్థల వైఫల్యాన్ని ఎండగడుతూ నెట్టింట హల్‌చల్ చేస్తున్న బొద్దింక పార్టీ లక్ష్యమేమిటో పాలకవర్గాలకు బాగానే అవగతం అయింది. సీజేపీ ఇస్తున్న ప్రేరణతో విలువల రాజకీయాలకు యువతరం నడుంబిగించింది. పారదర్శక పనితీరు, నీతీ,నిజాయిలకు పట్టం కట్టేందుకు సమాయత్తమవుతోంది. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీ ప్రాంత యువతరం బొద్దింక టీ షర్టులతో ఓ ప్రయోగం చేసింది. కాలుష్య కాసారంగా మారిన యమునా నదీ ప్రక్షాళనకు పూనుకుంది. పాలకవర్గాలు కళ్లున్న కబోదులైతే.. అధికార యంత్రాంగాలన్నీ నిర్వీర్యమైతే.. వ్యవస్థ అంతా కలుషితమైతే..జనం అవస్థలు తీర్చడానికి.. బొద్దింకలు ఎక్కడ పడితే.. అక్కడ.. ఎలా..అయితే.. అలా..శుద్ధి చర్యలు చేపడతాయని నిరూపించింది.

**తమిళ నాట ఇదే తరహా ప్రయోగం**

ఈ తరహా ప్రయోగమే ఇటీవల దక్షిణాది తమిళనాట ఎన్నికల రణరంగంలో జరిగింది. టీవీకే పార్టీ అధినేత దళపతి విజయ్ పేరుకు రీల్ స్టార్ అయినా కుళ్లిన రాజకీయ వ్యవస్థకు చక్కని పరిష్కారం చూపి రీయల్ స్టార్ అయ్యారు. పాలకుల వారసులే పాలకులనే శాశనాన్ని తప్పించి, పాలేర్ల స్థాయి వ్యక్తులను సైతం పాలనా వ్యవస్థలో భాగస్వాములను చేశారు. జెన్–జెడ్ ఐక్యతే స్ఫూర్తి మంత్రంగా తమిళనాట 32 మంది దళితులు జనరల్ స్థానాలనుంచి చట్ట సభల్లోకి అడుగుపెట్టగలిగారు. కూటి కోసం స్టీరింగ్ తిప్పే ఆటో డ్రైవర్లు కానీ ఖర్చు లేకుండా ఏకంగా ఎమ్మెల్యేలు అయ్యారు. ఏతా,వాతా తమిళనాట జెన్–జెడ్ నిశ్శబ్ద విప్లవం దశాబ్దాల రాజకీయ కోటలను బద్దలు చేసింది. యువతరం నిద్దులేచింది,వారసత్వ రాజకీయాలు,సంప్రదాయ అధికార పంపకాలకు కాలం చెల్లిందనే సంకేతాలను, యువతరం బేస్‌గా ఉన్న టీవీకే పార్టీ బలంగా చాటింది. తమిళ నాట యువశక్తి తిరుగుబాటుకు ఖంగుతిన్న రాజకీయ పార్టీలు శత్రులాభం,మిత్రం బేధం సమీకరణల కూర్పులో తలమునకలవుతున్నాయి.

**పోరాటం..పట్టుదలకు బొద్దింకలు మారుపేరు**

బొద్దింకలు బుద్ధి జీవుల దృష్టిలో అల్ప ప్రాణులే కావచ్చు.. భ్రష్టు పట్టిన వ్యవస్థలో బ(మె)తుకు పోరాటం చేస్తున్న పరాన్న జీవులే కావచ్చు.., ప్రకృతి పరంగా... తల నేల రాలినా.. చావుకు సైతం సవాలు విసిరే పటుత్వం బొద్దింకల సొంతం. వళ్లు జలదరించే ఆకారం ఉన్నప్పటికీ వ్యవస్థలోని వికారాలన్నింటినీ పుటం పెట్టి శుద్ధి చేసే పట్టుదల బొద్దింక సొంతం. వ్యవస్థ నుంచి అవమానం ఎదురైనా.. చులకన భావం పెనుభారంగా మారినా.. వ్యంగం అతిశయించినా.. రాలి పడిన చోటే..మొలకెత్తాలనేది బొద్దింక నైజం.. అదే కాక్రోచ్ జనతా పార్టీ ప్రాథమిక ఆశయం కూడా. నెట్టింట్ వైరల్ అవుతున్న ఐదు ఎజెండాలతో పాటు.. సమాజ హితాన్ని కోరుకునే అనేక ఎజెండాలు బొద్దింక సైన్యం జనం ముందుకు తెస్తోంది.

**సత్యం కోసమే బొద్దింకల ప్రశ్నించే తత్వం:**

వేళ్లు లెక్కించే లోపే వేలనుంచి కోట్లకు చేరిన బొద్దింక బలగం.. రాజకీయ వర్గాల వెన్నులో వణుకు పుట్టిస్తుంది. అందుకు అదే స్థాయి ప్రతిఘటన ఆ వర్గాల నుంచి క్రమ క్రమంగా మొదలైంది. ఏకంగా బొద్దింకలను పట్టి.. హిట్ ద్రావకంతో చంపే డెమో నిరసనలు ఐటీ హబ్ బెంగళూరు తరహా నగరాలనుంచి మొదలయ్యాయి. బొద్దింకలను పట్టి చంపినంత మాత్రాన 'ప్రశ్న' ఆగదనేది చారిత్రక సత్యం.. భూమి గుడ్రంగా ఉందని ప్రతిపాదించిన తత్వవేత్త సోక్రటీస్‌కు ఆ నాటి సమాజం విషపు పాత్ర బహుమతిగా ఇచ్చింది. అయినా చావని ప్రశ్న.. ప్రపంచానికి సత్యం.. మిగిల్చింది. భూమి గుండ్రంగా ఉందనేది.. ఆధునిక ప్రపంచం నూటికి నూరు శాతం నమ్ముతున్న సత్యం.. సత్యం కోసమే.. ప్రశ్న పుడుతుంది. ప్రశ్న నుంచే 'సత్యం' బయటకు వస్తుంది. అందుకోసమే జెన్– జెడ్ యువతరం బొద్దింక అవతారం ఎత్తింది. అవసరం మేరకు,అవకాశం మేరకు ప్రశ్నిస్తూనే ఉంటుంది. ప్రశ్నను ఆపడమంటే ఒక విధంగా అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపడమన్నమాటే..



# కర్ణాటకపై సీఎం విజయ్ చూపు..

- బెంగళూరు మున్సిపల్ ఎన్నికల్లో 'టీవీకే' పోటీకి సిద్ధం?
- త్వరలో బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు
- బెంగళూరులో నివసిస్తున్న లక్షలాది మంది తమిళులు
- కర్ణాటకలో జెండా పాతాలనుకుంటున్న విజయ్

హైదరాబాద్– సూర్య వాస్తవం

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి అధికార పగ్గాలు చేపట్టిన నటుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. తన పార్టీ టీవీకే విస్తరణలో భాగంగా ఆయన కర్ణాటక రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా, త్వరలో జరగబోయే బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ (బీబీఎంపీ) ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా కర్ణాటకలో పార్టీ జెండా పాతాలని విజయ్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐటీ హబ్ బెంగళూరు నగరంలో స్థానిక కన్నడిగులతో పాటు లక్షలాది మంది తమిళ ప్రజలు దశాబ్దాలుగా నివసిస్తున్నారు. అంతేకాకుండా, నటుడిగా విజయ్‌కు కర్ణాటక వ్యాప్తంగా, ముఖ్యంగా బెంగళూరులో భారీ సంఖ్యలో అభిమాన సంఘాలు, బలమైన ఫాలోయింగ్ ఉంది. ఇటీవల తమిళనాడు ఎన్నికల్లో టీవీకే సాధించిన చారిత్రాత్మక విజయాన్ని బెంగళూ రులోని విజయ్ అభిమానులు పెద్ద ఎత్తున వేడుకలు జరుపుకుని తమ మద్దతును చాటుకు న్నారు. ఈ సానుకూలతలను ఓట్లుగా మార్చుకుని, అక్కడి స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని టీవీకే అధిష్ఠానం భావిస్తున్నట్లు ఇన్‌సైడ్ టాక్ నడుస్తోంది. కర్ణాటక రాజకీయాల్లోకి టీవీకే ఎంట్రీ ఇస్తుందనే వార్తలు బెంగళూరు రాజకీయ వర్గాల్లో ఇప్పుడే ప్రకంపనలు సృష్టిస్తున్నప్పటికీ... దీనిపై విజయ్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. పార్టీని ఇతర దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించే వ్యూహంలో భాగంగానే ఈ ముందడుగు ఉండబోతోందని, త్వరలోనే బెంగళూరు ఎన్నికల పోటీపై టీవీకే స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

# నీట్ లీకేజీపై మోడీ మౌనం

- ప్రమాదంలో లక్షల మంది విద్యార్థుల భవిష్యత్
- ప్రధాని స్పందించరేం : రాహుల్ గాంధీ ఫైర్

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

నీట్–యూజీ 2026 పేపర్ లీక్ వివాదంపై ప్రధాని మోడీ మౌనం వహించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. వరుసగా జరుగుతున్న నీట్ పేపర్ లీక్‌లకు ప్రభుత్వ ఉదాసీనతే కారణమని పేర్కొన్నారు. అందుకే దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే పదవి నుంచి తప్పుకోవాలని మరోసారి డిమాండ్ చేశారు. తెలంగాణలోని హైదరాబాద్‌లో నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) ఆధ్వర్యంలో జరిగిన నిరసన వీడియోను జతచేస్తూ రాహుల్ ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. అందులో రాహుల్ ప్రధాని మోడీపై విమర్శలు గుప్పించారు. "లక్షలాది మంది యువకులు రోడ్లపైకి వచ్చినప్పుడు, 22 లక్షల మంది పిల్లల భవిష్యత్ ప్రమాదంలో పడినప్పుడు కూడా ప్రధాని మోడీ మౌనం గా ఉంటున్నారు. అంటే ఈ ప్రభుత్వం సమాధానం చెప్ప డంపై కాకుండా, తప్పించు కోవడంపైనే దృష్టి పెట్టింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి, నీట్ వంటి పేపర్ లీక్‌లను అరికట్టడానికి ఒక పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేసే వరకు మేము విశ్రమించం." అని రాహుల్ గాంధీ తెలిపారు.

**విద్యార్థుల కలలపై దాడి!**

నీట్ పేపర్ లీక్ సమస్యపై ఎన్ఎస్‌యూఐ తనదైన రీతిలో స్పందించింది. నీట్–యూజీ 2026 పేపర్ లీక్ అనేది '22 లక్షల మంది విద్యార్థుల కలలపై జరిగిన దాడి' అని అభివర్ణించింది. విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడటాన్ని ఇకపై సహించేది లేదని, ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

# ఒకే కుటుంబంలోని 8 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)
కొనసాగుతున్నాయి. ఈ విషాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం (ఎక్స్‌గ్రేషియా) ప్రకటించారు. "ఉత్తర కన్నడ జిల్లాలోని నదీతీర ప్రాంత ప్రజలు సీజనల్‌గా ఇలా నత్త గుల్లలు సేకరిస్తుంటారు. అదే విధంగా శిరాలీ గ్రామానికి చెందిన సుమారు 14 మంది నత్తగుల్లల (కప్పగుల్లలు) సేకరణ కోసం నదిలోకి దిగారు. అయితే వారు నీటి మట్టాన్ని సరిగ్గా అంచనా వేయకుండా లోతైన ప్రాంతంలోకి వెళ్లినట్టు తెలుస్తోంది. ఆ సమయంలో ఒక్కసారిగా నీటి ప్రవా హం పెరగడంతో ఒకరిద్దరు కొట్టుకుపోయారు. దీనితో వారిని రక్షించేందుకు మరికొందరు నదిలోకి దూకారు. కానీ వారు కూడా బలమైన నీటి ప్రవాహంలో చిక్కుకుపో యారు. "ఇప్పటి వరకు 8 మంది మృతదేహాలను వెలికితీశాం. మిగి లిన వారి కోసం గాలింపు చర్యలు జరుగు తున్నాయి" అని పోలీసులు తెలిపారు.

**మృతుల వివరాలు**

మృతులను ఉమేశ్ మంజునాథ్ నాయక్ (40), లక్ష్మి మహాదేవ్ నాయక్ (42), లక్ష్మి జట్టప్ప నాయక్ (30), లక్ష్మి అప్పన్న నాయక్ (60), లక్ష్మి శివరామ్ నాయక్ (49), జ్యోతి మస్తమ్మ నాయక్ (34), మాలతి నాయక్ (38), మస్తమ్మ నాయక్ (60)గా గుర్తించారు. ఇక నీటి ప్రవాహంలో చిక్కుకున్న నాగరత్న, మహాదేవిలను రక్షించి, వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. రెస్క్యూ సిబ్బంది, పోలీసు బృందాలు, స్థానికులు నదిలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన 8 మంది చనిపోవడంతో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి.

**ప్రమాదానికి కారణం?**

ఈ ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా నదిలీ ప్రవాహ ఉధృతి ఒక్కసారిగా పెరిగిందని, గుల్లలను సేకరిస్తూ నదిలోని లోతైన ప్రాంతాల్లోకి వెళ్లిన పలువురు ఈ ప్రవాహంలో చిక్కుకొని కొట్టుకొనిపోయారని పోలీసులు పేర్కొన్నారు. "చేపల వేటలాగే, నత్తగుల్లలు సేకరణ కొందరికి జీవనోపాధి కల్పించే ఒక వృత్తిగా ఉంది. మునిగి పోయిన వారిలో చాలా మందికి ఈ పనిలో మంచి అనుభవం ఉంది. వారిలో చాలా మందికి ఈత కూడా వచ్చు. అందుకే ప్రమాదానికి గల కారణాలపై ఇంకా నిర్ధరించాల్సి ఉంది" అని పోలీసులు తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డితో తమిళనాడు మంత్రి భేటీ

**హైదరాబాద్– సూర్య వాస్తవం**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తమిళనాడు మంత్రి పి విశ్వనాథన్ భేటీ అయ్యారు. ఆదివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సీఎం అభినందించారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాల గురించి సీఎంను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల తమిళనాడులో జరిగిన ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ తరుపున విజయం సాధించి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర నాయకులతో ఆయనకు సత్సంబంధాలున్నాయి.

# ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనం

(మొదటిపేజీ తరువాయి)

ధరలు పెరగడం, రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో యూనిఫాం క్లాత్, బూట్లు, బ్యాగుల సరఫరా ఆలస్యమవుతోందని విద్యాశాఖ అధికారులు తెలిపినట్లు లోకేష్ వివరించారు. అయితే, జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ కచ్చితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన వస్తువులను కూడా వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు అధికారులు తయారీ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని లోకేష్ పేర్కొన్నారు.

# రేలా.. అదిరేలా..

**- రంపచోడవరంలో ఘనంగా ఆదివాసీ ఉత్సవాలు ప్రారంభం**
**- సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం భారీగా కదిలొచ్చిన గిరిజనం**
**- ఆకుపచ్చ జెండాలతో ర్యాలీ, బహిరంగ సభ**

**చింతూరు, రాజవొమ్మంగి – సూర్య వాస్తవం**

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, హక్కులు, చట్టాల పటిష్ట అమలు కోసం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన మూడు రోజులపాటు పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరంలో తలపెట్టిన రేలా ఉత్సవాలు తొలి రోజైన ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండుటెండను సైతం లెక్కచేయకుండా ఆదివాసీలు ఈ ఉత్సవాలను చూసేందుకు పోటెత్తారు. పోలవరం జిల్లాలోని 12 మండలాల నుంచే కాకుండా అల్లూరి జిల్లా, తెలంగాణ ప్రాంతం నుంచీ పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో రంపచోడవరం కిక్కిరిసిపోయింది. ఆకుపచ్చని జెండాలు చేబూని అందరూ కదులుతూ ఉంటే ప్రకృతి మురిసినట్టయింది. స్థానిక సిరిగిందలపాడు నుంచి అంబేద్కర్ సెంటర్, ఫారెస్ట్ చెక్‌పోస్ట్ మీదుగా రేలా ఉత్సవాల సందర్భంగా ర్యాలీ సాగింది. ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, గిరిజన మేధావులు, ప్రముఖులు ఈ ర్యాలీ అగ్రభాగాన నడిచారు. రేలా దప్పుల మోత, థింసా నృత్యాలు, జానపద కళారూపాలు ర్యాలీలో ఆకట్టుకున్నాయి. అంబేద్కర్ సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి అక్కడా గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకూ ర్యాలీ సాగిన అనంతరం అక్కడి వేదికపై ఇంకొన్ని గిరిజన సంప్రదాయ కళారూపాలు ప్రదర్శించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ ఆదివాసీ ప్రజలంతా ఏకతాటిపై నిలిచి హక్కుల కోసం పోరాడితే తప్పకుండా సాధించుకోవచ్చునన్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు. వారి బలమేంటో వారి నీతి నిజాయితీ, కట్టుబాట్లు, సంప్రదాయ ఆచారాలను చూస్తే ఇట్టే అర్థమవుతుందన్నారు. ఆదివాసీల్లో ఎన్ని తెగలు ఉన్నప్పటికీ ఆదివాసీలుగా అంతా కలిసి మెలిసి ఉండాలన్నారు. పోలవరం నిర్వాసితులకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఆదివాసీలకు ఏజెన్సీలో వంద శాతం ఉద్యోగావకాశాలు కల్పించే జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. ఆదివాసీలు ఐక్యంగా లేకపోతే అణగారిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రేలా ఉత్సవాలు వంటివి జరిపి ఆదివాసీల సంస్కృతిని భావితరాలకు తెలియజెప్పాలన్నారు. ఎస్‌టి కమిషన్ సభ్యులు గొర్లె సునీత మాట్లాడుతూ ఆదివాసీల అభ్యున్నతికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నానాటికీ ఆదివాసీల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అడవిని నమ్ముకొని ప్రశాంతమైన జీవనం కొనసాగిస్తున్న ఆదివాసీలకు ప్రభుత్వం అన్ని రకాల సంక్షేమ పథకాలను అందించాల్సి ఉందన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ గిరిజనుల జీవితాలు మెరుగుపడాలన్నా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాలన్నా చట్టసభల్లో గిరిజనులు ఉండాలన్నారు. ఆదివాసీల జీవన విధానం, వ్యవసాయ పద్ధతులు ఎంతటి గొప్పవో తెలియజెప్పారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బొప్పెన కిరణ్, ఎంపిపి కారం లక్ష్మి, ఆదివాసీ, ఇతర ప్రజా సంఘాల నాయకులు జి.నారాయణరావు, బి వరప్రసాద్, సున్నం రాజులు, పండ సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

# నటి ట్విషా శర్మ మృతి కేసులో ట్విస్ట్..

**హైదరాబాద్ – సూర్య వాస్తవం:**

నటి ట్విషా శర్మ మృతి కేసు దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించగా, సోమవారం విచారణ జరగనుంది. గత ఏడాది డిసెంబర్‌లో న్యాయవాది సమర్థ్ సింగ్‌ను వివాహం చేసుకున్న ట్విషా, మే 12న భోపాల్‌లో అత్తింట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. వరకట్న వేధింపులు, మానసిక హింస కారణంగానే ఆమె ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. పరారీలో ఉన్న భర్త సమర్థ్ సింగ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి 7 రోజుల రిమాండ్‌కు పంపారు. కేసుపై సిబిఐ దర్యాప్తు కొనసాగుతుండగా, రెండో పోస్ట్‌మార్టం కోసం ఎయిమ్స్ వైద్య బృందం భోపాల్‌కు చేరుకోనుంది.



# ఎబోలా వైరస్‌పై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం

- ఏపీ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంస్రత్యకుమార్ యాదవ్ వెల్లడి
- కాంగో, ఉగాండా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు వైద్య పరీక్షలు చేసేలా చర్యలు
- విశాఖ, తిరుపతి, విజయవాడ ఇంటర్నేషనల్ విమానాశ్రయాలపై ప్రత్యేక దృష్టి
- అన్ని జిల్లాలకు ప్రత్యేక ఆదేశాలు




**కడప – సూర్య వాస్తవం**

ఆఫ్రికా ఖండంలోని పలు దేశాల్లో ఎబోలా వైరస్ విస్తృతి, కేసులు, మరణాల నమోదు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ముఖ్యశీగా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో 'ఏబోలా' వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీచేసిన హెచ్చరికలు, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకు వస్తున్న ప్రత్యేక మార్గదర్శకాలు, సలహాలు, సూచనల ఆధారంగా 'ఎబోలా' వైరస్ వ్యాప్తి, కేసులను సమర్థంగా ఎదుర్కొనేందుకు వైద్య, ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉందని మంత్రి ప్రకటించారు. ఆఫ్రికాలోని కాశీగో, ఉగాండా దేశాల్లో ఎబోలా తీవ్రత రోజురోజుకీ పెరుగుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో సదరు దేశాల నుంచి రాష్ట్రంలోనికి వైజాగ్, తిరుపతి, విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుల ద్వారా వచ్చే ప్రయాణికులు, పర్యాటకులను (ట్రావెల్ హిస్టరీ ఆధారంగా) వైరస్ నిర్ధారణ పరీక్షలు చేసే విషయంలో ఎయిర్ పోర్ట్ అథార్టీ, సదరు జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నేడొక ప్రకటనలో తెలిపారు. వైరస్ లక్షణాలు కలిగిన వారిని వెంటనే క్వారంటైన్ చేసి, పక్కనున్న వారికి కూడా వెంటనే వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. విశాఖ ఓడరేవు అధికారులతో కూడా మాట్లాడి, ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించామని చెప్పారు. విమానాల ద్వారా కాకుండా రోడ్డు మార్గాల ద్వారా వచ్చే వారి విషయంలోనూ అవసరమైన చర్యలు ఉంటాయన్నారు. ఎబోలా వైరస్ పీడిత దేశాల నుంచి దేశంలోని వచ్చే ప్రయాణికుల వివరాలను కేంద్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, ఇందుకు అనుగుణంగా అవసరమైన సమాచారాన్ని సదరు రాష్ట్రాలకు పంపుతోందని తెలిపారు. కొవిడ్ హయాంనాటి అనుభవాలు దృష్టిలో పెట్టుకుని 'ఏబోలా' విషయంలో ముందస్తు జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితులు తలెత్తితే తీసుకోవాల్సిన చర్యలపై 'యాక్షన్ ప్లాన్' సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖలో ఏఎన్ఎం, ఆశా వర్కర్ల నుంచి స్థాయి నుశీచి అందర్నీ 'వర్చువల్' సమావేశాల ద్వారా అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు.

**ఐసోలేషన్ వార్డులు సిద్ధం!**

అంతర్జాతీయ విమానాశ్రయాల నగరాల్లోని టీచింగ్ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసే 'ఐసోలేషన్' వార్డుల్లో 15 పడకల చొప్పున ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్రం నుంచి వస్తున్న సమాచారాన్ని జిల్లాలకు పంపుతూ అందర్నీ అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. పీపీఈ , వైరస్ నిర్ధారణ పరీక్షల కిట్లు తక్షణ అవసరాలకు సరిపడ ఉన్నాయని తెలిపారు.

**ప్రయాణాలు చేయకపోవడం మంచిది!**

కేంద్ర ప్రభుత్వం జారీచేసిన అడ్వయిజరీ మేరకు ప్రజలు అత్యవసరమైతే తప్ప, కాంగో, ఉగాండా, దక్షిణ సుడాన్ దేశాలకు ప్రయాణించొద్దని మంత్రి శ్రీ స త్యకుమార్ విజ్ఞప్తిచేశారు. గత మూడు వారాల కిందట ఎబోలో ప్రభావిత దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చిన వారు అనారోగ్యంగా ఉంటే జిల్లా అధికారులకు సమాచారాన్ని ఇవ్వాలని మంత్రి ప్రజలకు సూచించారు. దీనివల్ల అవసరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

**లక్షణాలు!**

ఎబోలా (బుండిబుగ్యో) వైరస్ కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాల్లోని అనేకమందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం కష్టం. వైరస్ సోకిన వారికి కొన్నివారాలపాటు లక్షణాలు బయటపడవు. దీనివల్ల ఎక్కువ మందికి తక్కువ వ్యవధిలో సోకే అవకాశం ఉంది.

సాధారణ జ్వరం, అకస్మాత్తుగా జ్వరం పెరిగిపోవడం, శరీరం మొత్తం బలహీనంగా అనిపించడం, తీవ్ర తలనొప్పి, గొంతునొప్పి, కండరాల నొప్పులు, రోజురోజుకి నొప్పులు తీవ్రమవుతుండటం, వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, కళ్ల ఎర్రబారడం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు ఎబోలా వైరస్ బారినపడిన వారిలో కనిపిస్తున్నాయి.

# మానవత్వం చాటుకున్న ఎస్ఐ త్రిలోక్

**- రోడ్డు ప్రమాద క్షతగాత్రుడికి అండగా నిలిచిన ఆసుపత్రి వైద్యులు, అవుట్ పోస్ట్ పోలీసులు**

**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :**

సమాజంలో మానవత్వం ఇంకా సజీవంగానే ఉందని నిరూపించే ఒక మహోన్నత ఘటన అనంతపురంలో వెలుగుచూసింది. భాష తెలియని పరాయి నేలపై, ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఒక అపరిచిత యువకుడికి వైద్యులు, పోలీసులు దేవుడిలా మారి ప్రాణాలు నిలిపారు. అసలు వివరాల్లోకి వెళితే....?కర్ణాటక రాష్ట్రంలోని హాసన్ ప్రాంతానికి చెందిన శ్రేయాస్ అనే యువ డ్రైవర్ ప్రయాణిస్తున్న వాహనం, గార్లదిన్నె సమీపంలోని జాతీయ రహదారిపై ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో శ్రేయాస్ కాళ్లు, చేతులు విరిగి, రక్తపు మడుగులో తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. భాష తెలియకపోవడం, బంధువులు ఎవరూ దరిదాపుల్లో లేకపోవడంతో అతడు ప్రాణాలకై కొట్టుమిట్టాడుతున్న తరుణంలో 108 సిబ్బంది సమయానికి స్పందించి అతడిని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.?

**వైద్యులు, పోలీసుల మానవతా దృక్పథం :**

రోగి ఏ రాష్ట్రం వాడు? ఎవరు? అనే ప్రశ్నలతో కాలయాపన చేయకుండా, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు కేవలం ప్రాణం కాపాడడమే



లక్ష్యంగా తక్షణమే అత్యవసర చికిత్సను ప్రారంభించారు. ఆసుపత్రి అవుట్ పోస్ట్ ఎస్ఐ త్రిలోక్నాథ్, హెడ్ కానిస్టేబుల్ స్వామి కేవలం విధి నిర్వహణకే పరిమితం కాలేదు. రక్తసంబంధీకులు లేని ఆ యువకుడికి చుట్టాలై నిలిచారు. దగ్గరుండి ఎక్స్‌రేలు, సిటీ స్కాన్లు, ఇతర అత్యవసర వైద్య పరీక్షలు వేగంగా జరిగేలా పర్యవేక్షించారు. ఆ యువకుడి వివరాలను సేకరించి, కర్ణాటకలోని



అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, "మీ బిడ్డ సురక్షితంగా ఉన్నాడు" అంటూ కొండంత అండగా నిలిచారు.

రక్తంతో తడిసిన రోడ్డు మీద అపరిచితుడిగా పడ్డ యువకుడికి వైద్యులు తల్లిదండ్రులయ్యారు, పోలీసులు చుట్టాలయ్యారు. మానవత్వమే దేవుడిగా మారింది."

**సమాజానికి సందేశం :**

ప్రస్తుత రోజుల్లో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు భయంతోనో, నిర్లక్ష్యంతోనో పక్కకు తప్పుకునే వారే ఎక్కువ. కానీ, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది, అవుట్ పోస్ట్ పోలీసులు చూపిన ఈ చొరవ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని చూసినప్పుడు భయపడకుండా ముందుకు వచ్చి సహాయం చేయాలని, మనం చేసే చిన్న సహాయం ఒక కుటుంబానికి ప్రాణదీపం అవుతుందని ఈ ఘటన నిరూపించింది. శ్రేయాస్ ప్రాణాలను కాపాడేందుకు అహర్నిశలు శ్రమించిన 108 సిబ్బందికి, అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్య బృందానికి, అవుట్ పోస్ట్ ఎస్ఐ త్రిలోక్నాథ్ మరియు సిబ్బందికి స్థానికులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- పొలంలోనే గడ్డి మందు తాగి బలవన్మరణం
- అరటి పంట నష్టాలతో తీవ్ర మనస్తాపం
- రూ.18 లక్షల అప్పులు.. కుటుంబంలో విషాదం



**పులివెందుల - సూర్య వాస్తవం :** అప్పుల ఊబిలో చిక్కుకుని మరో రైతు బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన వైఎస్సార్ కడప జిల్లాలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఇ.కొత్తపల్లె గ్రామానికి చెందిన రైతు బాల కృష్ణమూర్తి (42) అప్పుల భారాన్ని తట్టుకోలేక పొలంలోనే గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది.

కుటుంబ సభ్యులు, గ్రామస్తుల వివరాల మేరకు.. బాల కృష్ణమూర్తికి స్వంతంగా 1.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. సాగునీటి కోసం మూడు బోర్లు వేయించగా భారీగా అప్పులు అయ్యాయి. అప్పులు తీర్చేందుకు అదనంగా ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని అరటి పంట సాగు చేశారు. అయితే అరటి పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, పెట్టుబడులు పెరగడం వల్ల తీవ్ర నష్టాలు చవిచూశారు. ఈ క్రమంలో ప్రైవేట్ వ్యక్తుల వద్ద సుమారు రూ.18 లక్షల వరకు అప్పులు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పులు తీర్చే మార్గం కనిపించక తీవ్ర మనస్తాపానికి గురైన బాలకృష్ణమూర్తి శనివారం సాయంత్రం తన పెద్ద కుమారుడికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పినట్లు తెలిసింది. అనంతరం పొలంలోనే గడ్డి మందు తాగారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను పులివెందుల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆదివారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పులివెందుల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**రైతుల ఆత్మహత్యలపై ఆందోళన**

వ్యవసాయానికి పెట్టుబడులు పెరగడం, గిట్టుబాటు ధరలు లేకపోవడం, ప్రైవేట్ అప్పుల ఒత్తిడి కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకునేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు

- దేవాలయాల కంటే ముందుగానే తెరుచుకుంటున్న వైన్ షాపులు



**వేముల - సూర్య వాస్తవం :** వేముల మండలం బెస్తవారిపల్లె సమీపంలో ఉన్న ఓ వైన్ షాపులో నిబంధనలకు విరుద్ధంగా 24 గంటల పాటు మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం వేళల్లోనే షాపు తెరిచి ఉండటంతో పాటు అర్ధరాత్రి సమయాల్లో కూడా మద్యం అందుబాటులో ఉండటం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వం నిర్ణయించిన సమయాలను పట్టించుకోకుండా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా యువత మద్యం బారిన పడుతూ కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైన్ షాపు వద్ద రాత్రివేళ మద్యం సేవించి గుంపులుగా తిరుగుతున్న వ్యక్తుల కారణంగా మహిళలు, విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నట్లు చెబుతున్నారు. ఇక గ్రామ ప్రజలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, స్థానిక పోలీసులు ఈ వ్యవహారంపై దృష్టి సారించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బెస్తవారిపల్లెలో జరుగుతున్న ఈ వ్యవహారం ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# బండి రామముని రెడ్డిని పరామర్శించిన ఎంపీ అవినాష్ రెడ్డి

- పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటా



**తొండూరు - సూర్య వాస్తవం :** తొండూరు మండలం పరిధిలోని సంతకోవ్వూరు గ్రామానికి చెందిన వైకాపా మండల పరిశీలకుడు బండి రామముని రెడ్డి అనారోగ్యంతో కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆదివారం ఆసుపత్రికి వెళ్లి రామముని రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎంపీ వెంట జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శశికాంత్ రెడ్డి,తొండూరు మండల కన్వీనర్ భూమిరెడ్డి రవీంద్రారెడ్డి,వైకాపా నాయకులు బండి హరి ముకుందా తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- బక్రీద్ పండుగ సందర్భంగా శాంతిభద్రతలపై పోలీసుల దృష్టి



**తొండూరు - సూర్య వాస్తవం :** ఈ నెల 28వ తేదీన జరుపుకోనున్న బక్రీద్ పండుగ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ లో ప్రజలు శాంతియుత వాతావరణంలో, భక్తిభావంతో పండుగ జరుపుకోవాలని ఆదివారం పులివెందుల రూరల్ సీఐ శాంతిలాల్,ఎస్సై ఘన మద్దిలేటి సూచించారు. తొండూరు మండలంలో ఎటువంటి గొడవలు,అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. పండుగ రోజున మండల వ్యాప్తంగా పోలీస్ పికెటింగ్,పెట్రోలింగ్ ఉంటుందన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దని, అన్ని మతాల వారు సామరస్యంగా పండుగ జరుపుకోవాలని సీఐ విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# మహిళ, ఆడపిల్లల రక్షణ అవగాహన సదస్సు



**పెద్దవడుగూరు - సూర్య వాస్తవం :** చిత్రచేడు, గోపిరాజుపల్లి గ్రామాల్లో మహిళల భద్రత, సామాజిక రుగ్మతల నిర్మూలనే ధ్యేయంగా నిర్వహించిన ఈ అవగాహన సదస్సులు నిజంగా అభినందనీయం. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల మహిళలకు, బాలికలకు చట్టాలపై, తమ రక్షణ మార్గాలపై మంచి అవగాహన వస్తుంది. ఈ సందర్భంగా ఎస్సై అంజినేయులు ప్రస్తావించిన ప్రభుత్వ సాంకేతిక యాప్‌లు, పోర్టల్స్ మరియు వాటి ముఖ్య ఉద్దేశాల గురించి వివరస్తూ దిశ యాప్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన యాప్ ఇది. ప్రమాదంలో ఉన్నప్పుడు మహిళలు ఫోన్‌ను గట్టిగా ఊపడం ద్వారా లేదా యాప్‌లోని ఎస్ ఓ ఎస్ బటన్ నొక్కడం ద్వారా క్షణాల్లో కంట్రోల్ రూమ్‌కు, సమీపంలోని పోలీస్ వాహనానికి సమాచారం అందుతుంది. ప్రమాద స్థలాన్ని జీపీఎస్ ద్వారా గుర్తించి పోలీసులు త్వరితగతిన సంఘటనా స్థలానికి చేరుకుంటారు. జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టుల నుంచి మహిళలను రక్షించడానికి ఇది ఉపయోగపడుతుంది.

**వెబ్‌సైట్: సైబరక్రైమ్ .గవర్నమెంట్ .ఇన్**

మహిళలు, పిల్లలపై జరిగే సైబర్ నేరాలను ఈ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతారు. ఇండియా యాప్ 112/ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ దేశవ్యాప్తంగా ఒకే అత్యవసర నంబర్ విధానంలో భాగంగా దీనిని తీసుకొచ్చారు. శాంతి భద్రతలు, వైద్య, అగ్నిమాపక సేవలకు విడివిడిగా కాకుండా కేవలం 112 నంబర్‌కు కాల్ చేయడం లేదా యాప్ ఉపయోగించడం ద్వారా తక్షణ సాయం పొంద వచ్చు. ఇందులో కూడా మహిళల రక్షణ కోసం ప్రత్యేక ఫీచర్ ఉంది.

**షీ టీమ్స్ / స్థానిక రక్షణ విభాగాలు**

గ్రామాలు, పట్టణాల్లో మహిళలు, విద్యార్థినులను వేధించే ఆకతాయిల ఆటకట్టించడానికి, బాల్య వివాహాలు వంటి సామాజిక రుగ్మతలను అరికట్టడానికి ఈ విభాగాలు నిరంతరం నిఘా ఉంచుతాయి. ఇలాంటి అవగాహన సద స్సుల వల్ల గ్రామీణ మహిళల్లో భయంపోయి, చట్టాలు, సాంకేతికతపై నమ్మకం పెరుగుతుంది. రక్షణ అనేది కేవలం చట్టాల ద్వారానే కాదు, అవగాహన అప్రమత్తత ద్వారా కూడా సాధ్యమవుతుందని నిరూపించడానికి ఇటు వంటి గ్రామీణ సభలు ఎంతగానో తోడ్పడతాయి.

# పార్థసారథి హుందాగా రాజకీయాలు చేస్తే మంచిది

- వైయస్ కుటుంబం గురించి ఏది పడితే మాట్లాడితే సహించేది లేదు
- వేముల మండల వైసీపీ నాయకులు



**పులివెందుల - సూర్య వాస్తవం :** తెలుగు దేశం పార్టీకి చెందిన పేర్ల పార్థసారథి రెడ్డి చేసిన విమర్శలు పూర్తిగా అవాస్తవమైనవి అని వేముల మండల నాయకులు తీవ్రంగా ఖండించారు. సందర్భంగా ఆదివారం పులివెందులలోని జగన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పేర్ల పార్థ సారథి రెడ్డి మొగుడిని కొట్టి మొగసాలుకి ఎక్కినట్లు అన్న చందంగా అన్యాయంగా రాజారెడ్డిని పొట్టన పెట్టుకొని మళ్లీ తనకే అన్యాయం జరిగిందని చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు, జిల్లాలో పూర్తిగా ఫ్యాక్షన్‌ను అంతమొందించిన ఘనత వైయస్ కుటుంబందే అని పేర్కొన్నారు, మీకు పదవులు రావాలంటే ప్రజలకు మంచి చేసి మీ అధినాయకుడి దగ్గర పదవులు పొందాలే కానీ ఇలాంటి సత్య దూరమైనా ఆరోపణలు చేయడం సరికాదన్నారు, రెండేళ్లు గడుస్తున్నా ఎటువంటి అభివృద్ధి జరగలేదని, కనీసం రైతులకు సాగునీరు అందించే పరిస్థితి లేదని,గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, వైసిపి అధికారం లో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమం గురించే జగన్ పాటు పడ్డారని , కానీ మీరు ప్రజా సంక్షేమం మరిచి మైనింగ్ మాఫియా చేసుకుంటూ ప్రజా ధనాన్ని కొల్లగొడుతున్నారని మండిపడ్డారు పులివెందుల లో మళ్లీ ఫ్యాక్షన్ పునరావృతం అయ్యేలా మీరు చేసే ఆరోపణలు ఉన్నాయి అని రాజకీయాలు హుందాగా చేయాలని, వైఎస్ కుటుంబం గురించి ఏది పడితే అది మాట్లాడితే సహిం చేది లేదని గ్రామ స్థాయిలో ఉండే వైసీపీ నాయకులు కూడా చీము నెత్తురు తోనే బ్రతుకుతున్నామని, ఇకనైనా సౌమ్యంగా రాజకీయాలు చేయాలని హితవు పలికారు.. ఈ కార్యక్రమం లో మండల కన్వీనర్ సాంబశివ రెడ్డి, జెడ్పిటీసీ బయపురెడ్డి, వేముల మాజీ సర్పంచ్ రాఘవ రెడ్డి, ఎంపీపీ గంగాదేవి వెంకట నారాయణ,ఎంపీటీసీలు మల్ రెడ్డి, రామచంద్ర రెడ్డి , పేరం గంగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ లు మదర్సా వల్లి, రాధాకృష్ణయ్య, డిసిసి మాజీ వైస్ చైర్మెన్ ఆంజనేయులు, కో ఆప్షన్ మహబూబ్ పీరా, నాయకులు చలమారెడ్డి, రాజారెడ్డి, వేముల చలపతి, నాగభూషణం, గంగాధర్, మల్లారెడ్డి, శ్రీనివాసులు, శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా నారాయణరెడ్డి 31వ వర్ధంతి

- నివాళులు అర్పించిన మాజీ మ్మెల్యే వై విశ్వేశ్వరరెడ్డి



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** స్థానిక మండలంలోని రాకెట్ల గ్రామంలో ఉరవకొండ నియోజకవర్గం వైసీపీ సమన్వయ కర్త వై.విశ్వేశ్వర్ రెడ్డి తండ్రి రాకెట్ల నారాయణరెడ్డి, తమ్ముడు రాకెట్ల రవీంద్రనాథ్ రెడ్డి 31 వ వర్ధంతి సందర్బంగా వారి సమాధికి పూల మాల వేసి నివాళులు అర్పిస్తున్న ఉరవకొండ నియోజకవర్గం సమన్వయ కర్త వై విశ్వేశ్వర్ రెడ్డి మరియు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, ఉరవకొండ నియోజకవర్గం పరిశీలకులు వైసీ గోవర్ధన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వై మధుసూదన్ రెడ్డి గారు, అలాగే జోనల్ అధికార ప్రతినిధి కెవి రమణ, వైఎస్సార్ విద్యార్థి విభాగం జోనల్ ఇంచార్జి ప్రణయ్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ రాష్ట్ర పంచాయతి రాజ్ వింగ్ కార్యదర్శి నాగభూషన్ రెడ్డి వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ వెంకటేష్ పట్టణ ఉపాధ్యక్షులు గోపి పట్టణ కార్యదర్శి రఘునందన్ విద్యార్థి సంఘం నాయకులు వసీమ్ బేగ్, ఉరవకొండ నియోజక వర్గం కార్యకర్తలు అభిమానులు నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ రాజ్యాంగ విరుద్ధంగా జరుగుతున్న వ్యవహారం

- ప్రజలందరూ తిప్పి కొట్టాలి
- యూజేఏసీ కన్వీనర్ జాఫర్
- ఒక వర్గానికి చెందిన ఓట్లను నిర్లాక్షిణ్యంగా తొలగించారు
- జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్,
- కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ



**అనంతపురం – సూర్య వాస్తవం :** మైనారిటీ ఎక్స్ప్రెస్ ఎడిటర్ బాబా షా మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమైన వ్యవహారమని యునైటెడ్ జేఏసీ కన్వీనర్ జాఫర్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నగరంలోని యునైటెడ్ జేఏసీ కార్యాలయంలో ఆదివారం ఉదయం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన, జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ, బాబా షా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ పేరుతో రాజ్యాంగబద్ధంగా కల్పించినటువంటి ఓటు హక్కులను తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల మూడవసారి అస్సాం లో అధికారం చేపట్టిన తర్వాత ఎస్ఐఆర్ ను ఎందుకు అమలుపరచలేదని ప్రశ్నించారు. ఎస్ ఐ ఆర్ నోటిఫికేషన్ ను గత రెండు పర్యాయాలు విడుదల చేశారని ఇందులో భాగంగా అనంతరం నిర్వహించిన ఎన్నికలలో భారీ ఎత్తున ఓటర్లను తొలగించడం జరిగిందన్నారు. కేవలం తమ అధికారకాంక్ష కోసం ఒక వర్గానికి చెందిన ఓట్లను తొలగించేందుకు లౌకిక రాజ్యాన్ని పూర్తిగా అణచివేసేందుకు ఇలాంటి వ్యవహారానికి తెర లేపారని మండిపడ్డారు. రెండు పర్యాయాలు నిర్వహించిన ఎస్ ఐ ఆర్ వ్యవహారంలో నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించారని మండిపడ్డారు. ప్రస్తుతం 16 రాష్ట్రాలలో నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని దీనిని పూర్తిగా వ్యతిరేకించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని వారు పిలుపునిచ్చారు. ఏ విధంగా ఎన్ ఆర్ సి ఎన్ పి ఆర్, సిఏఏ లను అడ్డుకున్నాము అదేవిధంగా ఎస్ ఐ ఆర్ ను ప్రజా సంఘాలు రాజ్యాంగ వేత్తలు లౌకికవాదులు ఏకతాటిపైకి వచ్చి దీనిని పూర్తిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అనంతపురం వేదికగా ఎలాంటి ఉద్యమం అయిన తొలుత శ్రీకారం జరుగుతోందని ఇందులో భాగంగానే ఎస్ ఐ ఆర్ కు వ్యతిరేకంగా అనంత వేదికగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నడుపుదామని పిలుపునిచ్చారు. దీనికి అన్ని వర్గాల వారు ఏకం కావాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే ఇది ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాకపోయినా ఒక వర్గానికి చెందిన వారి ఓట్లను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని పెద్ద ఎత్తున అభద్రత భావం ప్రజలలో ఉందని వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యతను రాజకీయ పార్టీల నేతలు తీసుకోవాలని కోరారు. అలా కాకుండా ఇష్టానుసారంగా ఓటర్లను తొలగించడం చేయడం ద్వారా ప్రజలలో తీవ్ర అభద్రత నెలకొని ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. దీనిని కార్యరూపం దాల్చేందుకు అనంతపురం వేదికగా పెద్ద ఉద్యమాన్ని నడుపుతున్నామన్నారు. ఇందులో భాగంగా బక్రీద్ పండుగ అనంతరం అనంతపురం నగరంలో ఎస్ ఐ ఆర్ కు వ్యతిరేకంగా భారీ ఎత్తున ర్యాలీని నిర్వహించేందుకు సన్నద్ధం అవుతున్నామని తెలిపారు. దీనిని ప్రతి ఒక్కరూ విజయవంతం చేసేందుకు తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. మన అందరి మాట ఎస్ఐఆర్ వ్యతిరేకమనే నినాదంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

# మహిళల్ని అవమానించే వ్యాఖ్యలు మానాలి

- మహిళల్ని పిల్లల్ని కనే యంత్రాలుగా మాట్లాడుతున్న చంద్రబాబుకు మహిళలే తగిన గుణపాఠం చెప్తారు
- ఐద్వా నాయకురాలు షేమిమ్ బేగం




**డోన్ –సూర్య వాస్తవం**

ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పుడు మహిళలను పిల్లల్ని కనే యంత్రాలుగా మాట్లాడడం తీవ్ర అభ్యంతరకరమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకురాలు షేమిమ్ బేగం ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆదివారం శ్రీనివాస నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఐద్వా సమావేశంలో ఐద్వా నాయకురాలు షేమిమ్ బేగం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జనాభా పాలసీ పూర్తి బాధ్యతారాహిత్యంతో కూడుకున్నదని విమర్శించారు. అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, రెండేళ్లు దాటినా అమలు చేయలేదని గుర్తుచేశారు. ఇప్పుడు మూడో బిడ్డకు రూ.30 వేలూ, నాలుగో బిడ్డకు రూ.40 వేలూ ఇస్తామని ప్రకటించడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ఇప్పటికీ పిల్లలకు సరైన విద్యా సదుపాయాలు, పోషకాహారం అందడం లేదని తెలిపారు. పుట్టే పిల్లల్లో మరణాల రేటు అధికంగా ఉందని, ప్రతి 1000 మంది పిల్లల్లో సుమారు 30 మంది మరణిస్తున్నారని పేర్కొన్నారు ఐదేళ్లలోపు పిల్లల్లో 63 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని, 60 శాతం మహిళలకు ఎనీమియా ఉందని తెలిపారు. ప్రతి ఇద్దరు మహిళల్లో ఒకరు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని వివరించారు. జనాభాను పెంచాలని ఆర్ఎస్ఎస్ సూచిస్తున్న విధానాలను ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఈ జనాభా పాలసీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఐద్వా నాయ కులు మాధవి, షాబాన,లతో మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# 25 ఏళ్ల అనంతరం ఘనంగా పూర్వ విద్యార్థుల కలయిక




**పామిడి –సూర్య వాస్తవం :** స్థానిక శ్రీ సరస్వతీ విద్యా మందిరం పాఠశాలలో 2000–01 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించి, వారి సేవలను స్మరించుకు న్నారు. అనంతరం విద్యార్థి దశలోని అనుభవాలు, సరదా సంఘటనలు, జీవిత ప్రయాణంలో సాధించిన విజయాలను పరస్పరం పంచుకున్నారు. చాలాకాలం తరువాత కలుసుకున్న స్నేహితులు భావోద్వేగాలకు లోనై ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదాత్మక ఆటలు, గ్రూప్ ఫోటోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టాలని, భవిష్యత్తులో కూడా ఈ బంధాన్ని కొనసాగించా లని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కమిటీ సభ్యులు రత్నయ్య, చౌడయ్య, ఆచార్యులు నరసింహులు, శ్రీనివాసులు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

- ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అంకాలమ్మ తల్లి



**పులివెందుల అర్బన్ – సూర్య వాస్తవం :** పులివెందల పట్టణం పార్నపల్లి రోడ్డు సమీపంలో నడిబొడ్డున కొలువై ఉన్న అంకాలమ్మ తల్లికి ఆదివారం పర్వది నాన ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృ తాభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన, తదితర పూజా కైకర్యాల అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు అందుకొని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని, ప్రతి ఆదివారం ఆలయానికి వస్తున్నటువంటి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేస్తూ జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు ఎండోమెంట్ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 'మీ రక్షణ – మా బాధ్యత'పై అవగాహన సదస్సు

- రూరల్ సీఐ శాంతిలాల్, ఎస్ఐ ఘణ మద్దిలేటి చొరవ




**తొండూరు – సూర్య వాస్తవం :** స్థానిక తొండూరు సభా భవనంలో ఆదివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'మీ రక్షణ – మా బాధ్యత' పేరుతో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పులివెందుల రూరల్ సీఐ శాంతిలాల్,తొండూరు ఎస్ఐ ఘన మద్దిలేటి ఈ కార్యక్రమానికి హాజరై గ్రామస్తులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళల భద్రత,సైబర్ నేరాలు,ట్రాఫిక్ నిబంధనలు, డయల్ 112, శక్తి యాప్ వినియోగం గురించి వివరించారు. అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు ప్రజలు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# భరోసా పార్టీ ఆంధ్ర ప్రదేశ్ కమిటీ నిర్ణయాలు



**ప్రొద్దుటూరు– సూర్య వాస్తవం :** భరోసా పార్టీ జాతీయ అధ్యక్షుడు చింతల ఏసయ్య పత్రికా ప్రకటన విడుదల చేశారు. పార్టీ గురించి రకరకాల ప్రచారం జరుగుతున్న కారణంగా పార్టీ పూర్తి విషయాలను ప్రజలతో పంచుకొనుటకు పత్రిక ప్రకటన విడుదల చేస్తున్నామని ప్రకటించారు. గత రెండు నెలల క్రితం అభినయ్ దర్శన్ అను వ్యక్తికి పార్టీ ఆంధ్రప్రదేశ్ యొక్క ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించడం జరిగిందని తెలిపారు. గత కొన్ని రోజులుగా అతనిపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పాడేరు నియోజకవర్గ పరిధిలో జరిగిన హత్యయత్నము కేసు విషయమై పూర్తి వివరాలు తెలుసుకొనుటకు ప్రయత్నిస్తున్నామన్నారు. పార్టీ యొక్క క్రమశిక్షణ కమిటీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి నిజ నిర్ధారణ చేసి, పోలీస్ శాఖ, ప్రభుత్వ విచారణను పరిగణలోకి తీసుకొని తదుపరి చర్యలు ఉంటాయని తెలియజేశారు. ప్రస్తుతం మీడియా కథనాల ప్రకారం లేదా పోలీసు శాఖ విచారణను బట్టి అభినయ దర్శన్ ను వివరణ కోరుతూ నోటీసులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. క్రమ శిక్షణా చర్యల్లో భాగంగా పార్టీ తొలగించే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. భరోసా పార్టీకి నష్టం కలిగించే విధంగా ఎవరు చేసినా పార్టీ క్రమశిక్షణ చర్యలు ఉంటాయని తెలియజేశారు. ప్రజలకు గాని ఎవ్వరూ పార్టీకి గానీ మంచి చేసే వారు ఎవరిని అయినా పార్టీలోకి ఆహ్వానిస్తామని తెలిపారు. అలాగే పార్టీకి నష్టం కలిగించే పనులు ఏదైనా ఎవరు చేసిన క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# సయ్యద్ ఫరూక్ కుమారుడి నిఖా వేడుకల్లో పిసిసి జనరల్ సెక్రెటరీ



**రాయచోటి – సూర్య వాస్తవం:** నియోజకవర్గ కేంద్రమైన రాయచోటి పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త, తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకుడు, సయ్యద్ ఫరూక్ కుమారుడు సయ్యద్ సుహైబ్ నిఖా వేడుకలు ఆదివారం స్థానిక రాజధాని ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్ (సీఎల్పీ) హాజరై పెళ్లి కుమారుడు సుహైబ్ కు ఆశీర్వదించి నేటి నుంచి నూతన దాంపత్య జీవితాన్ని ప్రారంభించాలని కోరుతూ వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకల్లో స్థానిక నాయకులు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నేడు ఎంపీ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం

**- కార్యక్రమం విజయవంతం సహకరించాలని పిలుపు ఎంపీ**



**పులివెందుల - సూర్య వాస్తవం :** వైసీపీ పార్టీ బలోపేతమే లక్ష్యంగా బూత్ లెవెల్ ఏజెంట్లు ఇన్చార్జిలతో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో పులివెందుల నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం నిర్వహించనున్నారు. పులి వెందుల పట్టణంలోని వైయస్సార్ ఆడిటోరియంలో జిల్లా ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో పులివెందుల నియోజకవర్గ స్థాయి నాయకులు ఏజెంట్లతో రాబోయే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పై అవగాహన సమావేశం, కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, మారిన వివరాల అప్డేట్ వంటి అంశాలతో బూత్ లెవెల్ ఏజెంట్లు బాధ్యతగా వ్యవహరించే విధంగా దిశా నిర్దేశం చేయనున్న నేపథ్యంలో బూత్ లెవెల్ ఏజెంట్లు, నాయకులు ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమం విజయవంతం సహకరించాలని పార్టీ అధినేతలు పిలుపునిచ్చారు.

## లారీ చక్రాల శబ్దాల మధ్య మొదలైన ప్రయాణం

**- డాక్టర్ విజయంతో ముగిసిన తండ్రి కల**



**వేంపల్లె - సూర్య వాస్తవం:** పేదరికం మధ్య పుట్టిన ఒక కల,కష్టాల మధ్య పెరిగిన ఒక ఆశ నేడు ఆ కల నిజమైంది. సాధారణ లారీ డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించిన మహబూబ్ బాషా కుమారుడు డా. సమీర్ బాషా ఎంబీబీఎస్‌ను ఫస్ట్ క్లాస్‌తో పూర్తి చేసి కుటుంబానికి అపారమైన ఆనందాన్ని అందించారు. జీవితమంతా రోడ్లపైనే గడిపిన తండ్రి, తన పిల్లలు మాత్రం మంచి స్థాయికి చేరాలని ఎన్నో త్యాగాలు చేశారు. ఎండలు, వర్షాలు, నిద్రలేని రాత్రులు, అలసటతో కూడిన ప్రయాణాలు ఇవన్నీ తన కుమారుడి భవిష్యత్తు కోసం మహబూబ్ బాషా మౌనంగా భరించారు.తల్లి కౌసర్ ప్రేమ, అన్న డా. ఉమర్ బాషా అండదండలు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో సమీర్ బాషా వైద్య విద్యలో విజయం సాధించారు. ఒక లారీ డ్రైవర్ కుమారుడు డాక్టర్ కావడం ఇప్పుడు ఎంతోమంది పేద కుటుంబాల పిల్లలకు స్ఫూర్తిగా నిలుస్తోంది.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు భావోద్వేగంతో మాట్లాడుతూ,తండ్రి పడిన ప్రతి చెమట చుక్క కు నేడు విలువ దక్కింది. ఆయన జీవిత కష్టం మా కుటుంబ గర్వంగా మారింది అని ఆనందం వ్యక్తం చేశారు.స్థానిక ప్రజలు, బంధుమిత్రులు డా. సమీర్ బాషాకు అభినందనలు తెలియజేస్తూ, ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

## ఉచిత క్యాన్సర్ చికిత్స శిబిరంకు విశేష స్పందన


**- డా. యస్ యఫ్. బాషా**



**వేంపల్లె - సూర్య వాస్తవం:** వేంపల్లెలోని భాషా ఆసుపత్రిలో ఆదివారం ఉచిత క్యాన్సర్ గుర్తింపు చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత శిబిరాన్ని ప్రజలు, రోగులు సద్వినియోగం చేస్తున్నారు అని అన్నారు. కడప వైద్యుడు వంశీ విహారి రోగులను పరీక్షించి వారికి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆల్ అమీన్ సొసైటీ అధ్యక్షుడు డా.బాషా, వైద్యురాలు షాహినా, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫారక్ కుమారుడి వివాహ విందులో పాల్గొన్న టిడిపి మైనార్టీ శ్రేణులు

**రాయచోటి - సూర్య వాస్తవం:** రాయచోటి పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త, టిడిపి మైనార్టీ నాయకుడు, సయ్యద్ ఫరూక్ కుమారుడి వివాహ వేడుకలు ఆదివారం స్థానిక రాజధాని ఫంక్షన్ హాల్ లో వైభవంగా జరిగాయి. ఈ వివాహ వేడుకలకు ముఖ్య అతిథిగా రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ టీటీడీ పాలకమండలి సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు హాజరు కావాల్సిన ఆయన రైల్వే కోడూరులో జరిగిన టిడిపి అత్యవసర సమావేశంలో పాల్గొని అక్కడి నుండే పెళ్లి కుమారుడు సుహైబ్ కు హృదయపూర్వక శుభాకాంక్షలను చరవాణిలో తెలియజేశారు. ఈ వేడుకలకు స్థానిక తెలుగు దేశం పార్టీ ముఖ్య మైనార్టీ శ్రేణులు ఇర్షాద్, సయ్యద్, ఖాదర్బాస్, న్యూ చార్మినార్ షారుక్, హాజరై పెళ్లి కుమారుడు సుహైబ్ కు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఈ వివాహ వేడుకల్లో స్థానిక నాయకులు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# పులివెందుల ప్రాంత అభివృద్ధి వైయస్ కుటుంబీకుల చలువే

- అభివృద్ధి రాజకీయం మాది- ఫ్యాక్షన్ రాజకీయం మీది
- బీటెక్ రవి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి
- బీటెక్ రవి వ్యాఖ్యలపై వైకాపా నాయకుల మండిపాటు



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల ప్రాంత అభివృద్ధికి ముమ్మాటికి వైయస్ కుటుంబీకుల చలువే అని, అభివృద్ధి రాజకీయం వైయస్ కుటుంబంది కాగా ఫ్యాక్షన్ రాజకీయం బీటెక్ తెదేపా నాయకులదని ఇప్పటికైనా బీటెక్ రవి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని వైకాపా నాయకులు పేర్కొన్నారు. వైయస్ కుటుంబం పై బీటెక్ రవి చేసిన వ్యాఖ్యలపై ఆదివారం జగన్ క్యాంపు కార్యాలయం నందు ఏర్పాటుచేసిన సమావేశంలో వైకాపా నాయకులు మాట్లాడుతూ అధికారం లో ఉంటే తప్ప ఎమ్మెల్సీగా, మీ సతీమణి జెడ్పిటిసి గా గెలిచే అవకాశం లేదని, వైయస్ కుటుంబ సభ్యులు ఫ్యాక్షన్ రాజకీయాలు చేసే వారైతే ఈ రోజు టీడీపీ నాయకులు పులివెందులలో తిరిగే పరిస్థితి లేదని, బీటెక్ రవి స్వంత గ్రామంలో ఎంపీటీసీ గా నువ్వు, 1983 లో చంద్రబాబు ఎమ్మెల్యే గా ఓడిపోవడం వాస్తవమో కాదో తెలిపాలని, కడప జిల్లా నుంచి ఫ్యాక్షన్‌ను ప్రారదోలిన చరిత్ర వైయస్ కుటుంబానిదేనని, 1975 నుంచి ప్రతి ఫ్యాక్షన్ గ్రామం నుంచి రెండు వర్గాల వారిని ఏకం చేసిన ఘనత వైయస్ కుటుంబానిదే , మీకు పులివెందులలో ప్రజాభిమానం లేకనే గెలవలేని స్థితిలో అడ్డదారిలో గూండాలను, పోలీసులను అడ్డుపెట్టుకొని జెడ్పిటిసి ఎన్నికల్లోనీ సతీమణిని అనైతికంగా గెలిపించుకోవడం వాస్తవం కాదా, ఈ రోజు పులివెందుల ప్రాంతం ప్రశాంతంగా, సస్యశ్యామలంగా అభివృద్ధి చెందింది అంటే దానికి కారణం వైయస్ కుటుంబీకులదే, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే రాజారెడ్డి ని అత్యంత కిరాతకంగా హత్య చేయించి వారిని ఎన్టీఆర్ భవన్‌లో దాచిపెట్టిన దుసంస్కారం తెలుగు దేశం పార్టీది, గడిచిన రెండేళ్లలో పులి వెందులలో అభివృద్ధి మాట దేవుడెరుగు పులివెందుల అంటే జూదం, ఇసుక మాఫియా మైనింగ్ మాఫియాలకు పెట్టింది పేరులా మార్చిన ఘనత బీటెక్ రవిది అన్నది సత్యమని, చంద్రబాబు నీచ రాజకీయాలు, వెన్నుపోటు హత్య రాజకీయాలు రాష్ట్రానికే కాదు దేశం మొత్తానికి కూడా తెలుసునని, బీటెక్ రవి ఇకనైనా వైయస్ కుటుంబం గురించి నిరాధారమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఛైర్మెనలు వరప్రసాద్, చిన్నప్ప, జిల్లా అధికార ప్రతినిధులు సర్వోత్తమ రెడ్డి, దశరథరామిరెడ్డి, రాష్ట్ర నూర్బాష సంఘం అధ్యక్షుడు రసూల్,పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ వైస్ ఛైర్మెన్ హాఫీజ్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

**- పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ**




**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** జూన్ 15 నుంచి జులై 14 వరకు పత్తికొండ నియోజకవర్గంలో నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఇంటింటి సర్వేలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పనిచేస్తున్న బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ పిలుపునిచ్చారు.స్థానిక కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాలులో పత్తికొండ నియోజకవర్గ స్థాయ బూత్ లెవల్ ఏజెంట్లు శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలకు ఎన్నికల కమిషన్ చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ప్రతి సంవత్సరం ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపుల ప్రక్రియను నిర్వహిస్తోందన్నారు. అయితే 20 సంవత్సరాలకు ఒకసారి చేపడుతున్న ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు కావాలని, అనర్హుల పేర్ల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఎన్నికల కమిషన్ గుర్తించిన పత్తికొండ నియోజక వర్గంలోని 257 మంది బూత్ లెవల్ ఏజెంట్లు గ్రామ స్థాయి నాయకులు, బీఎల్‌ఓలతో సమన్వయం చేసుకుంటూ నెల రోజుల పాటు ఇంటింటికీ తిరిగి ఓటరు వివరాలను పరిశీలించాలని సూచించారు. పార్టీ శ్రేణులు ప్రతి కుటుంబాన్ని కలుసుకొని ప్రజలకు సరైన సమాచారం అందిస్తూ, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, వైసీపీ రాష్ట్ర కమిటీ నాయకులు, జిల్లా కమిటీ నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, బీఎల్‌ఓలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీటెక్ రవి లాంటి దమ్మున్న నాయకుడు లేకనే వైయస్ కుటుంబీకుల గెలుపు

**- సొంత వారిని హతమార్చే చరిత్ర వైయస్ కుటుంబానిది**

**- తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అక్కులగారి విజయ్ కుమార్ రెడ్డి**



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందులలో ప్రజలకు గట్టి భరోసా ఇచ్చి దేనికైనా దమ్ముగా నిలబడేటటువంటి బీటెక్ రవి లాంటి నేతలు లేకనే వైయస్ కుటుంబీకుల ప్రాధాన్యత కొనసాగిందని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం సొంత మనసులోనే హతమార్చిన చరిత్ర వైఎస్ కుటుంబ ఘనత అని తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అక్కులగారి విజయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వైయస్ కుటుంబం పై ప్రజలలో ప్రస్తుత పరిస్థితిని గత పరిస్థితిని విజయ్ తెలియజేస్తూ వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డి, ప్రస్తుతం ఒక జగన్మోహన్ రెడ్డి లాంటి వ్యక్తులను నమ్మి నలుగురు వచ్చేవారు లేరని ఆ నలుగురు కాస్తా మాకెందుకు లేనిపోని సమస్యలు వాళ్లింట్లో ఉండే మనుషులనే చంపు కుంటున్నారని మనం కాస్త వాళ్ల దగ్గరికి వెళ్ళిపోతే మనకెందుకు ఈ రాజకీయం అనేటువంటి పరిస్థితికి వాళ్ల ఫ్యామిలీ దిగజారిపోయే పరిస్థితికి వచ్చిందని, రాజశేఖరరెడ్డి చనిపోయిన తర్వాత వాళ్ల మీద ప్రజలకు ఎవరికీ నమ్మకాలు లేవు. కాకపోతే, వాళ్ళు రౌడీయిజం, వాళ్లు చేసే విధి విధానాలు, ఆ హింస, వాళ్లు కేసులు పెట్టించడం, ఆస్తి నష్టము ఇలాంటి వన్నీ ఎన్నో చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే వారిని ఆ రోజుల్లో కూడా బీటెక్ రవి లాంటి వ్యక్తి కూడా ఉండి ఉంటే తెలుగుదేశం పార్టీ ఏనాడో పులివెందులలో జెండా ఎగరవేసేదని, గట్టి భరోసా, దేనికైనా దమ్ముగా నిలబడేటువంటి వ్యక్తి బీటెక్ రవి అని?అలాంటి నాయకుడు ఆ రోజు ఉండి ఉంటే ఈ రోజు ఇంత దూరం వచ్చి ఉండేవాళ్ళు కూడా కాదు. ఇంత రోజు రాజశేఖరరెడ్డి సీఎం అయి ఉండేవాడో కాదో తెలియదు, కానీ ఈ రోజు రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా దేశ రాజకీయాల్లో కూడా వీళ్లు ఇలాంటి పేర్లు వినిపించి ఉండేవి కాదని ఎందుకంటే బీటెక్ రవి లాంటి వ్యక్తులు లేకనే వాళ్లు ఇన్ని రోజులు కొనసాగాయని విమర్శించారు.

## అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా అడ్వకేట్ రామకృష్ణ రెడ్డి

**- పార్టీ కోసం, న్యాయవాదిగా చేస్తున్న కృషికి గుర్తింపు**

**- టీడీపీ సీనియర్ నాయకులు ఘనసత్కారం**



**పులివెందుల - సూర్య వాస్తవం:** ఏజీపీ (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా నియమితులైన పులి వెందుల నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు, అడ్వకేట్ రామకృష్ణ రెడ్డిని పులి వెందుల టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ డైరెక్టర్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మహబూబ్ బాష, గంగాధర్ రెడ్డి, నల్లాగారి భాస్కర్ రెడ్డి పాల్గొని, రామకృష్ణ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ, పార్టీ పట్ల రామకృష్ణ రెడ్డి కున్న నిబద్ధతను, ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. పార్టీ కోసం, న్యాయ వాదిగా ఆయన ఎంతో కాలంగా చేస్తున్న కృషికి దక్కిన గుర్తింపుగా ఈ పదవి లభించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పులివెందుల మండల టీడీపీ అధ్యక్షుడు మార్తల జగన్ మోహన్ రెడ్డి, తెలుగు యువత వెంకటేశ్వర రెడ్డి, మైనార్టీ అధికార ప్రతినిధి ఖాసీం తదితర నాయకులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. తనను సత్కరించిన పార్టీ నాయకులకు, శ్రేయోభిలాషులకు రామకృష్ణ రెడ్డి కృతజ్ఞతలు తెలుపుతూ, తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని, పార్టీ అభివృద్ధికి మరియు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయ్ దేవరకొండ సరసన ప్రీతి ముకుందన్ స్పెషల్ సాంగ్





విజయ్ దేవరకొండ, కీర్తి సురేష్ కాంబినేషన్లో 'రౌడీ జనార్ధన'


దిల్ రాజు నిర్మాణంలో, రవి కిరణ్ కోలా దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ సినిమా

స్పెషల్ సాంగ్ కోసం ప్రీతి ముకుందన్‌తో చర్చలు

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ, డైరెక్టర్ రవి కిరణ్ కోలా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రౌడీ జనార్ధన' గురించి ఒక క్రేజీ అప్‌డేట్ ఫిలిం నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాలో ఒక స్పెషల్ సాంగ్ కోసం రవి కిరణ్ కోలా అదిరిపోయే సిచువేషన్‌ను డిజైన్ చేశారట. ఈ మాస్ నంబర్ కోసం 'కన్నప్ప' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న బ్యూటీ ప్రీతి ముకుందన్‌ను తీసుకోవాలని చిత్ర యూనిట్ గట్టిగా ప్లాన్ చేస్తోంది. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఆమెతో చర్చలు కూడా సాగుతున్నాయని, అంతా ఓకే అయితే విజయ్ దేవరకొండతో కలిసి ప్రీతి ముకుందన్ స్టెప్పులేయడం ఖాయమని తెలుస్తోంది.

ఈ సినిమాకు సంబంధించి మరో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్ ఏంటంటే.. సీనియర్ యాక్టర్, యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్ ఈ చిత్రంలో ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఆయన క్యారెక్టర్ చాలా వైవిధ్యంగా ఉండటమే కాకుండా, లుక్ పరంగా కూడా మునుపెన్నడూ చూడని విధంగా చాలా భిన్నంగా ఉండబోతోందని టాక్. కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం టాలీవుడ్‌లో భారీ అంచనాలను క్రియేట్ చేస్తోంది. ఒకవైపు 'రణబాలి' సినిమా చేస్తూనే, మరోవైపు ఈ 'రౌడీ జనార్ధన'తో బాక్సాఫీస్ వద్ద పక్కా కమర్షియల్ హిట్ కొట్టాలని విజయ్ దేవరకొండ గట్టి పట్టుదలతో ఉన్నాడు.

# డిజిటల్ ప్రపంచంలోకి చిరంజీవి



పోడ్‌కాస్ట్ టాక్ షో ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న మెగాస్టార్

తన కష్టాలు, సవాళ్లు, ఆసక్తికర సంఘటనలను అభిమానులతో పంచుకోనున్న చిరంజీవి

ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్న ప్రముఖ రచయిత, దర్శకుడు బి.వి.ఎస్. రవి

దశాబ్దాలుగా వెండితెరపై కోట్లాది మంది అభిమానులను తన నటనతో, డాన్సులతో అలరించిన మెగాస్టార్ చిరంజీవి ఇప్పుడు సరికొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్నారు. తొలిసారిగా ఆయన డిజిటల్ ప్రపంచంలోకి అడుగుపెట్టబోతున్నారనే వార్త ఇప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఒక ప్రతిష్టాత్మక పోడ్‌కాస్ట్ టాక్ షో ద్వారా ఆయన త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం.

శూన్యం నుంచి ప్రయాణాన్ని ప్రారంభించి, ఒక సాధారణ వ్యక్తి తెలుగు సినిమా ఇండస్ట్రీని శాసించే మెగాస్టార్ స్థాయికి ఎలా ఎదిగారు? ఆ ప్రయాణంలో ఆయన ఎదుర్కొన్న సవాళ్లు, కష్టాలు, ఎవరికీ తెలియని తెరవెనుక ఆసక్తికర సంఘటనలు, విజయాల వెనుక ఉన్న అసలు కథలను ఈ పోడ్‌కాస్ట్ ద్వారా చిరంజీవి స్వయంగా అభిమానులతో పంచుకోబోతున్నారు. రాబోయే తరాలకు స్ఫూర్తినిచ్చేలా ఈ షో ఉండబోతోంది.

ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ప్రముఖ రచయిత, దర్శకుడు బి.వి.ఎస్. రవి రూపొందిస్తున్నారు. గతంలో నందమూరి బాలకృష్ణ హోస్ట్ చేసిన 'అన్‌స్టాపబుల్' షోను తన రైటింగ్, కంటెంట్‌తో సూపర్ హిట్ చేసిన ఆయన.. ఇప్పుడు చిరంజీవి ప్రాజెక్ట్‌కు బాధ్యతలు చేపట్టడం అంచనాలను మరింత పెంచేసింది.

ఈ పోడ్‌కాస్ట్ గురించి గతంలో చిరంజీవి కుమార్తె సుష్మిత కొణిదెల కూడా కొన్ని హింట్స్ ఇచ్చారు. గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై ఈ ప్రాజెక్ట్ తెరకెక్కే అవకాశం కనిపిస్తోంది. బి.వి.ఎస్. రవి కూడా ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని పరోక్షంగా ధృవీకరించారు.

అయితే ఈ షోలో ఎవరెవరు గెస్టులుగా పాల్గొంటారు? చిరంజీవితో కలిసి పనిచేసిన స్టార్ డైరెక్టర్లు, నిర్మాతలు, తోటి నటీనటులు ఇందులో కనిపిస్తారా? లేక ఆయన కెరీర్‌లోని ఇండస్ట్రీ హిట్ చిత్రాలను బేస్ చేసుకుని ఎపిసోడ్‌లను డిజైన్ చేస్తారా? అనే అంశాలపై ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ఏదేమైనా వెండితెరపై బాక్సాఫీస్ రికార్డులను షేక్ చేసిన మెగాస్టార్.. ఈ కొత్త డిజిటల్ ఇన్నింగ్స్‌తో ఓటీటీ ప్లాట్‌ఫార్మ్‌లలో ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తారో చూడాలి.



# ముంబైని ఓడించి ప్లేఫ్స్‌లోకి రాజస్థాన్...

## ఎలిమినేటర్ లో సన్‌రైజర్స్ తో ఢీ

- ముంబై ఇండియన్స్‌ను 30 పరుగుల తేడాతో ఓడించి ప్లే ఆఫ్స్‌కు చేరిన రాజస్థాన్
- ఈ విజయంతో పంజాబ్, కోల్‌కతా ప్లే ఆఫ్స్ ఆశలకు గండి
- ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో రాజస్థాన్ రాయల్స్ ఢీ
- సూర్యకుమార్ యాదవ్ (60) పోరాటం వృథా, 9వ స్థానంతో సీజన్‌ను ముగించిన ముంబై
- ఆల్ రౌండర్ ప్రదర్శనతో ఆకట్టుకున్న జోఫ్రా ఆర్చర్



ఐపీఎల్ 2026 సీజన్‌లో ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న చివరి బెర్తును రాజస్థాన్ రాయల్స్ కైవసం చేసుకుంది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఆదివారం జరిగిన అత్యంత కీలకమైన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 30 పరుగుల తేడాతో విజయం సాధించి, ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఈ గెలుపుతో రాజస్థాన్ తమ స్థానాన్ని పదిలం చేసుకోవడమే కాకుండా, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల ఆశలపై నీళ్లు చల్లింది. ఇక చండీగఢ్‌లో మే 27న జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది.

నేటి మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్, నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. బ్యాటర్లందరూ సమష్టిగా రాణించడంతో రాజస్థాన్ ఈ స్కోరును సాధించగలిగింది. ధ్రువ్ జురెల్ (38), దాసున్ శనక (29) కీలక ఇన్నింగ్స్‌లు ఆడగా, చివర్లో జోఫ్రా ఆర్చర్ (15 బంతుల్లో 32), రవీంద్ర జడేజా (11 బంతుల్లో 19 నాటౌట్) మెరుపు వేగంతో పరుగులు సాధించి జట్టు స్కోరును 200 దాటించారు.

206 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ముంబై ఇండియన్స్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జోఫ్రా ఆర్చర్ అద్భుత బౌలింగ్‌తో రోహిత్ శర్మను డకౌట్‌గా పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత నమన్ ధిర్ (6), రియాన్ రికెల్టన్ (12), తిలక్ వర్మ (3) కూడా స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సూర్యకుమార్ యాదవ్ (42 బంతుల్లో 60) అద్భుతమైన అర్ధశతకంతో ఒంటరి పోరాటం చేశాడు. అతనికి విల్ జాక్స్ (33), కెప్టెన్ హార్దిక్ పాండ్యా (34) నుంచి మంచి సహకారం లభించడంతో ముంబై శిబిరంలో ఆశలు చిగురించాయి. ఒక దశలో మ్యాచ్ ఉత్కంఠగా మారింది.

అయితే, కీలక సమయంలో రాజస్థాన్ బౌలర్లు మళ్లీ పట్టు సాధించారు. ప్రమాదకరంగా మారుతున్న హార్దిక్ పాండ్యాను జోఫ్రా ఆర్చర్ అవుట్ చేయగా, ఆ తర్వాత ఓవర్లోనే నాంద్రే బర్గర్.. క్రీజులో పాతుకుపోయిన సూర్యకుమార్‌ను పెవిలియన్ పంపాడు. ఈ రెండు వికెట్లతో ముంబై ఓటమి ఖాయమైంది. చివరకు ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 175 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ ఓటమితో ముంబై ఇండియన్స్ ఈ సీజన్‌ను 9వ స్థానంతో నిరాశగా ముగించింది.

# 17 ఏళ్లకే అంపైర్‌గా అరంగేట్రం...

## క్రికెట్ కుటుంబం నుంచి కొత్త తరం!



కేరళలో 17 ఏళ్ల నమ్రతా వినోద్ క్రికెట్ అంపైర్‌గా అరంగేట్రం

రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి మ్యాచ్ అఫిషియేట్‌గా అర్హత

తల్లి, అత్త కూడా కేరళ తరపున ఆడిన మాజీ క్రికెటర్లు

టెన్షన్ లేదని, ప్రశాంతంగా ఉండటమే ఇష్టమని చెప్పిన నమ్రత

కేరళలోని త్రిస్సూర్ ఆత్రేయ క్రికెట్ గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం జరిగేది కేవలం ఓ సాధారణ మ్యాచ్ కాదు. అది 17 ఏళ్ల నమ్రతా వినోద్ జీవితంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది. అంపైరింగ్ రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఆమె, ఈ మ్యాచ్‌తో అధికారికంగా అంపైర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించబోతోంది. త్రిచూర్, పాలక్కాడ్ జిల్లాల క్రికెట్ అసోసియేషన్ కమిటీల మధ్య జరిగే ఈ మ్యాచ్‌కు ఆమె అంపైర్‌గా వ్యవహరించనుంది.

నమ్రత కుటుంబానికి క్రికెట్‌తో విడదీయరాని బంధం ఉంది. ఆమె తల్లి నికేత కేరళ మాజీ మహిళా క్రికెటర్, సెలక్షన్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా కూడా పనిచేశారు. అలాగే, నమ్రత అత్త (తండ్రి సోదరి) విలాసిని నాయర్ కూడా కేరళకు ప్రాతినిధ్యం వహించి, ప్రస్తుతం సదరన్ రైల్వే కోచ్‌గా ఉన్నారు. ఇంతటి క్రికెట్ నేపథ్యం ఉన్నప్పటికీ, నమ్రత ఎలాంటి ఒత్తిడి లేకుండా ఎంతో ధీమాగా కనిపిస్తోంది.

"ఇందులో పెద్ద విషయమేముంది? టెన్షన్ పడితే పనులు మరింత క్లిష్టంగా మారతాయి. అందుకే నేను ప్రశాంతంగా ఉండటానికే ఇష్టపడతాను" అని నమ్రత నవ్వుతూ చెప్పింది. అయితే, ఆమె తల్లి నికేత మాత్రం కాస్త ఉత్కంఠగా ఉన్నట్లు తెలిపారు. "ఒక క్రికెట్ మ్యాచ్‌లో ఎలాంటి పరిస్థితులు ఉంటాయో నాకు తెలుసు కాబట్టి కొంచెం టెన్షన్‌గా ఉంది. కానీ, నమ్రత ధైర్యంగా ఉండటం సంతోషాన్నిస్తోంది" అని ఆమె అన్నారు. చిన్నప్పటి నుంచి గాయనిగా, డ్యాన్సర్‌గా ఎన్నో వేదికలెక్కిన నమ్రత, ఇప్పుడు క్రికెట్ మైదానంలో తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతోంది.

# పార్టీ బలోపేతమే లక్ష్యం

**- బూత్ లెవెల్ ఏజెంట్లు, ఇన్‌ఛార్జ్‌లతో ప్రత్యేక వైసీపీ సమావేశం**

**ఉరవకొండ – సూర్య వాస్తవం :** స్థానిక పట్టణంలోని వీర శైవ కళ్యాణమండపం నందు ఉరవకొండ నియోజకవర్గ ఇన్చార్జ్ వై విశ్వేశ్వర్ రెడ్డి, యువనేత ప్రణయ్ రెడ్డి ఆధ్వర్యంలో సిపి వీరన్న అధ్యక్షతన నిర్వహించినఈ కార్యక్రమం లో క్షేత్రస్థాయి నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లతో రాబోయే స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియపై అవగాహన సమావేశం. కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, మారిన వివరాల అప్‌డేట్ వంటి అంశాలతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. బూత్ స్థాయి కార్యకర్తలే పార్టీకి బలమైన పునాది. ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా మనం అందరం సమిష్టిగా కృషి చేసి పార్టీని మరింత బలోపేతం చేద్దాం. ఈ సమావేశంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సర్ ఇంఛార్జ్ గోపీనాథ్ యాదవ్, యువనేత ప్రణయ్ రెడ్డి వివరిస్తూ బూత్ స్థాయి డిజిటలైజేషన్ ప్రస్తుత రోజుల్లో కేవలం కాగితాలకే పరిమితం కాకుండా సాంకేతికతను వాడుకోవడం అవసరం. ప్రతి బూత్ పరిధిలోని అనుకూల ఓటర్లతో లేదా స్థానిక ప్రజలతో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, పార్టీ సమాచారాన్ని, స్థానిక సమస్యల పరిష్కారాలను పంచుకోవాలి. ఓటర్ డేటా అనలిటిక్స్ గత ఎన్నికల్లో ఆ బూత్‌లో పార్టీకి వచ్చిన ఓట్లు, ప్రత్యర్థి పార్టీకి వచ్చిన ఓట్ల సరళిని విశ్లేషించి, బలహీనంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఓటర్ల విభజన బూత్ కమిటీ సభ్యులు ఓటర్లను కేవలం సంఖ్యగా కాకుండా, వర్గాలుగా విభజించి ప్రచారం చేయాలి. మొదటిసారి ఓటర్లు యువతను ఆకర్షించడానికి వారి ఉపాధి, విద్య మరియు సాంకేతికతకు సంబంధించిన అంశాలపై చర్చించాలి. తటస్థ ఓటర్లు ఏ పార్టీకి స్పష్టమైన మద్దతు ఇవ్వని ఓటర్లను గుర్తించి, వారిని పార్టీ వైపు తిప్పుకునేందుకు ప్రత్యేక వ్యూహం అమలు చేయాలి. ప్రభుత్వ పథకాల సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలను నిరంతరం పలకరిస్తూ ఉండాలి. బూత్ కమిటీ బాధ్యతలను మరింత సులభతరం చేయడానికి ఈ విధానం బాగా పనిచేస్తుంది.





ఓటర్ల జాబితాలోని ప్రతి పేజీకి ఒక బాధ్యుడిని నియమించాలి. ఆ పేజీలో ఉన్న 25–30 మంది ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం, పోలింగ్ రోజున వారు ఓటు వేసేలా చూడటం ఈ పేజీ ప్రముఖ్ బాధ్యత. దీనివల్ల బూత్ ప్రెసిడెంట్‌పై భారం తగ్గుతుంది. నిరంతర ప్రజా సంబంధాలు ఎన్నికలు ఉన్నప్పుడే కాకుండా, సాధారణ రోజుల్లోనూ బూత్ కమిటీ యాక్టివ్‌గా ఉండాలి. స్థానికంగా ఎవరికైనా ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, లేదా పెన్షన్ వంటి ప్రభుత్వ సేవలలో ఇబ్బందులు ఉంటే బూత్ కమిటీ ముందుండి సహాయం చేయాలి. ఇది ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుంది.అని గోపినాథ్ యాదవ్, ప్రణయ్ రెడ్డి నాయకులకి బూత్ లెవెల్ కమిటీలకి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ నియోజకవర్గ పరిశీలకుడు గోవర్ధన్ రెడ్డి, అధికార ప్రతినిధి సిపి వీరన్న, మీడియా కోఆర్డినేటర్ కెవి రమణ, జెడ్పిటిసి సభ్యులు మమత త్రిలోక్ నాథ్ రెడ్డి, ఎంపీపీలు నరసింహులు, కరణం పుష్పవతి, రమాదేవి, విద్యార్థ విభాగం జిల్లా ఉపాధ్యక్ష మంజునాథ్ రెడ్డి, నాయకులు బసవరాజు, ప్రసాద్ అశోక్ , ఏసి ఎర్రిస్వామి ఐదు మండలాల కన్వీనర్లు, ఐటీ వింగ్ సభ్యులు, పార్టీ కేంద్ర కార్యాలయం ముఖ్య నాయకులు, ఉరవకొండ నియోజకవర్గ ముఖ్య నాయకులు, బూత్ లెవెల్ ఇన్చార్జులు, బూత్ లెవెల్ ఏజెంట్లు వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# మహానాడు విజయవంతం చేయాలని పిలుపు

**చెన్నూరు– సూర్య వాస్తవం :** తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీలలో గోసుల కళ్యాణమండపంలో నిర్వహించనున్న మహానాడును విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ కల్లూరు విజయభాస్కర్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం చెన్నూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి మహానాడు అత్యంత కీలకమైన కార్యక్రమమని, పార్టీ భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేసే వేదికగా నిలుస్తుందని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పుత్త కృష్ణ చైతన్య రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, నియోజకవర్గ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతం వంటి అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. మహానాడు ద్వారా పార్టీకి కొత్త ఉత్సాహం, స్పష్టమైన కార్యాచరణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహానాడుకు హాజరయ్యే నాయకులు, కార్యకర్తల కోసం తాగునీరు, భోజనం, విశ్రాంతి తదితర సౌకర్యాలను



ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి (బుజ్జన్న), ఆకుల ప్రసాద్ బాబు, షబ్బీర్, సుదర్శన్ రెడ్డి, ఆకుల ప్రసాద్ బాబు,ఆకుల చలపతి, ఆటో బాబు,ఆవుల పవన్ కుమార్ రెడ్డి, అతికారి విశ్వం, యమల మణికంఠ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాలలో

## నేడు మెగా జాబ్ మేళా

**- ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్రశేఖర్**

**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం :** బ్రహ్మంగారి మఠంలోని స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల నందు సోమవారం నాడు జరిగే మెగా జాబ్ మేళాను బ్రహ్మంగారిమఠం మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్విని యోగం చేసుకొని వినియోగించుకోగలరని ప్రిన్సిపల్ ముండ్లపాటి చంద్రశేఖర్ పత్రిక ప్రకటనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మా కళాశాల కరస్పాండెంట్ మాజీ మంత్రివర్యులు డాక్టర్ డిఎల్ రవీంద్ర రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌కేవల్లి కళాశాల కమిటీ సభ్యులు ఎస్ఆర్ శ్రీనివాసులురెడ్డి ఆశీస్సులతో కడప లోని కొప్పర్తి నందు నిర్మించిన ఛానల్ పే కంపెనీ వారితో సంప్రదించి మా కళాశాలలో నేడు మెగా జాబ్ మేల నిర్వహించి బ్రహ్మంగారిమఠం మండల వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశం కల్పించి వారి నిరుద్యోగతను తొలగించా లనే లక్ష్యంతో ఈ జాబ్ మేళా మా కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని ఇందుకుగాను 10వ తరగతి ఆ పైన విద్యా అర్హత కలిగిన వారు పాల్గొనవచ్చునని ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని ఉద్యోగం పొందిన వారికి ఆకర్షణీయమైన జీతముతో ఉచిత భోజనం వసతి రవాణా సౌకర్యంతో పాటు వైద్య సౌకర్యం కంపెనీవారు



కల్పిస్తారని కావున బ్రహ్మంగారిమఠం మండల వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఉద్యోగం పొందగలరని ఆయన తెలిపారు.

# ముస్లిం మత పెద్దలందరిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, బక్రీద్ పండుగను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగనివ్వకుండా జరుపుకోవాలి



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి అనంతపూర్ జిల్లా ఎస్పీ పి.జగదీశ్ ఉత్తర్వులు మేరకు గుంతకల్ డిఎస్పి శ్రీనివాసులు పర్యవేక్షణలో ఆదివారం సీఐ రామారావు, ఎస్ఐ సురేష్, సిబ్బందితో కలిసి ఈనెల 27వ తేదీన జరగబోవు బక్రీద్ పండగ సందర్భంగా ముస్లిం మత పెద్దలందరిని పోలీస్ స్టేషన్ కు పిలిపించి, మీటిం గ్ ఏర్పాటు చేసుకొని పండుగను ప్ర శాంతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగనివ్వకుండా జరుపుకోవాలని, పండుగ రోజున హిందువులు సాంప్రదాయకంగా భావించే ఆవులను వ్యధకు గురి చేయకూడదని తెలియజేయడం జరిగింది. వీరితోపాటు పశువులను వ్యధ చేసే వ్యక్తుల్ని కూడా పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

# గంగమ్మ దేవస్థానం ఛైర్మన్‌గా సోడి వెంకటేశ్వర్లు యాదవ్ ప్రమాణస్వీకారం



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం :** మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ గా వెంకటేశ్వర్లు 11 మంది సభ్యులతో కలిసి ఆదివారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య ఈవో శ్రీనివా సులు అధ్యక్షతన ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతున్న వెంకటేశ్వర్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ 11 మంది కమిటీ సభ్యులతో కలిసి ఉత్తర్వులు పడ్డాయని దీంతో ఆయన ప్రమాణస్వీకారం నిర్వహించాలని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా సోడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చైర్మన్ గా నియమించినందుకు రాష్ట్ర రోడ్డు రవాణా యోజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆయన సోదరుడు మడ్డిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డిలకు మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# సమిష్టి కృషితో పార్టీని బలోపేతం చేసుకుందాం

**- పర్వతరెడ్డి గారిపల్లెలో ప్రజలు, యువత, వైసిపి కార్యకర్తలు, నాయకులతో శ్రీకాంత్ రెడ్డి మమేకం**

**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం :** మండలంలోని దిన్నెపాడు గ్రామం పర్వతరెడ్డిగారిపల్లెలలో ఆదివారం ప్రజలు, యువత వైసిపి కార్యకర్తలు, నాయకులతో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి మమేకమయ్యారు. సమిష్టి కృషితో పార్టీని బలోపేతం చేసుకుందామని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.పార్టీ కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టి, వేధించారని దూదేకుల పల్లె, వడ్డెపల్లెలకు చెందిన వారు శ్రీకాంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.అక్రమ కేసులకు భయ పడవద్దని, న్యాయపోరాటం చేద్దామని, ధైర్యంగా ఉండాలని వారికి శ్రీకాంత్ రెడ్డి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో దిన్నెపాడు వైసీపీ యువ నాయకులు గజేంద్రా రెడ్డి, వైసీపీ నాయకులు సుబ్బా రాయుడు, మాజీ ఉప సర్పంచ్ రఫీ, వైసీపీ నాయకులు నరసరాజు, నాగరాజు, ఎంపీ వెంకట్రామ రాజు, తదితరులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )